ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
సోమవారం 26 ఆగస్టు 2024


మదనపల్లె పట్టణ నడిబొడ్డున డంప్ చేసిన ఇసుక నిల్వలు

ఎక్కడ చూసినా ఇసుక నిల్వలే..

- క్షేత్రస్థాయిలో కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- గుర్తింపు లేని రీచ్‌లతో అవస్థలు
- అనధికారికంగా వాగులు, వంకలపై ఆధారం
- ఉచిత ఇసుక విధానంలో గందరగోళం

మదనపల్లె టౌన్, ఆగస్టు 25: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఉచిత ఇసుక విధానం అమలులో గందరగోళ పరిస్థితులు తలెత్తుతుండటంతో మదనపల్లె కాంట్రాక్టర్లు, భవన నిర్మాణ యజమానులు ముందస్తుగానే ఇబ్బడి ముబ్బడిగా ఇసుకను నిల్వ చేసుకుంటున్నారు. మదనపల్లెలో నిత్యం 100కు పైగా పెద్ద భవనాలు, 500పైగా చిన్న భవన నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటికి అనుగుణంగా ప్రతిరోజూ ఎంత లేదన్నా 100 ట్రాక్టర్ల ఇసుక అవసరం ఉంది. గత వైసీపీ ప్రభుత్వ పాలనలో ఇసుక ధరలు అమాంతం పెరిగిపోయి భవన నిర్మాణం రంగం కుదేలైంది. ఈ క్రమంలో ఉమ్మడి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు అవుతున్నా, ఉచిత ఇసుక విధానంలో స్పష్టమైన నిబంధనలు, ధరలు నిర్ణయించకపోవడం, సంబంధిత అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి.

ఇబ్బడి ముబ్బడిగా ఇసుక, మట్టి నిల్వలు

మదనపల్లె పట్టణంలో పలుచోట్ల ఇసుకను అక్రమంగా నిల్వ చేసుకున్నారు. కొందరు భవన నిర్మాణ కార్మికులు ముందుగా తీసుకున్న బిల్లులు చూపించి, ఏకంగా 20 నుంచి 30 ట్రాక్టర్లు, 10 టిప్పర్లతో ఇసుకను తమ ఇళ్ల వద్దకు తరలించుకున్నారు. ఉదాహరణకు మదనపల్లె మండలం బార్లపల్లె గ్రామం వద్ద కొందరు నెల రోజుల క్రితం భారీగా ఇసుకను డంప్ చేశారు. ఇసుక డిమాండ్ అయితే డంప్ చేసిన నిల్వల నుంచి ట్రాక్టర్లతో ఇసుకను పట్టణానికి తరలించి అధిక ధరలకు విక్రయించే అవకాశం ఉంది. పట్టణానికి తూర్పువైపున రోజా ఫ్లాట్లలో సుమారు 30 టిప్పర్ల ఇసుకను నిల్వ చేశారు. ఈ విషయమై కొందరు అక్కడ ప్రశ్నిస్తే పాత వే బిల్లులను చూపించి ఈ ఇసుక ఎప్పుడో రవాణా చేసుకున్నామని చెబుతున్నారు. పట్టణ శివారులోని కురవంక, బసినికొండ, తట్టివారిపల్లె, ఆరోగ్యవరం, కొత్తపల్లె ప్రాంతాల్లో కూడా కొందరు ఇసుకను అక్రమంగా నిల్వ చేశారు. దీంతో పాటు గుట్టల నుంచి ఎర్రమట్టిని తోడి చిన్న టిప్పర్లు, ట్రాక్టర్లతో భువనేశ్వరి ఆలయం వెనుక భారీగా నిల్వ ఉంచారు.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ

ఉచిత ఇసుక విధానం అమలులో ప్రత్యేకంగా భూగర్భ, వనరుల శాఖ అధికారులు పర్యవేక్షించాల్సి ఉంది. కానీ భూగర్భ, వనరుల శాఖలో తగినంత మంది అధికారులు, సిబ్బంది లేకపోవడంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కష్టమవుతోంది. దీంతో రెండు నెలలుగా ఇసుక తరలింపును అడ్డుకోవడంలో ఈ శాఖాధికారులు దాదాపు చేతులెత్తేశారు. ఇకపోతే ఇసుక అక్రమ రవాణాపై దృష్టి పెట్టాల్సిన రెవెన్యూ అధికారులు ఫ్రీహోల్డ్ భూముల రీవెరిఫికేషన్ విధులు నిర్వహిస్తుండటంతో ట్రాక్టర్లు, టిప్పర్ల ఇసుక రవాణాపై దృష్టి పెట్టడం లేదు. ఎస్ఈబీ అధికారులైనా ఈ వైపు దృష్టి పెడతారనుకుంటే దగ్గరలో ఎస్ఈబీ, ఎక్సైజ్ శాఖలు విలీనం అవుతున్న క్రమంతో పాటు ఈ ప్రభుత్వ శాఖలో బదిలీలు మొదలు కానున్నాయి. దీంతో ఈ శాఖ కూడా ఇసుక అక్రమ రవాణాపై దృష్టిపెట్టడం లేదు. దీంతో సందట్లో సడేమియా అంటూ కొందరు అక్రమార్కులు ఇసుకను నిల్వ చేసుకుని, డిమాండ్‌ను బట్టి విక్రయిస్తున్నారు.

మదనపల్లెలో రీచ్‌లు లేక ప్రజల అవస్థలు

మదనపల్లె ప్రాంత ప్రజలు ఉచిత ఇసుక విధానంలో ఇసుక కావాలంటే దగ్గరలో ప్రభుత్వ గుర్తింపు ఉన్న రీచ్‌లు అసలు లేవు. దీంతో ఇక్కడి ప్రజలు చిత్తూరు జిల్లా బంగారుపాళెం నుంచి దాదాపు 80 కిలోమీటర్ల దూరం వెళ్లి ఇసుకను రవాణా చేసుకోవాల్సి వస్తోంది, కడప వద్ద గుర్తింపు ఉన్న ఇసుక రీచ్‌లో నాణ్యమైన ఇసుక లభిస్తున్నా 110 కిలోమీటర్ల దూరం కావడంతో ఇసుక భారం పెరుగుతోంది. గతంలో పీలేరు నియోజకవర్గం మేడికుర్తి నుంచి 35 కిలోమీటర్ల దూరంలో అప్పటి ప్రభుత్వం ఇసుక రీచ్‌ను ఏర్పాటు చేయగా అక్కడి నుంచి ఇసుకకు డబ్బులు చెల్లించి మదనపల్లెకు రవాణా చేసేవారు. ఈ క్రమంలో అక్కడ కూడా గ్రామస్థులు పలుమార్లు అడ్డుకోవడంతో మదనపల్లె ఇసుక సరఫరా చేసే కాంట్రాక్టర్లు అటువైపు వెళ్లడం లేదు. మదనపల్లె ఇసుక కాంట్రాక్టర్లు మండలంలోని చీకిలబైలు నుంచి నిమ్మనపల్లె మండలం అగ్రహారం వరకు విస్తరించిన బాహుదా నదిలోని ఇసుక నిల్వలపై ఆధారపడాల్సి వస్తోంది. దీంతో ట్రాక్టర్, టిప్పర్ల యజమానులు అనధికారికంగానే వాగులు, వంకలపై ఆధారపడాల్సి వస్తోంది. మండలంలోని అంకిశెట్టిపల్లె, వేంపల్లె, పొన్నేటిపాళెం, సీటీఎం, కొత్తవారిపల్లె గ్రామాల సమీపంలోని వాగులు, వంకల్లో నుంచి ఇసుకను ట్రాక్టర్లలో తరలించి విక్రయిస్తున్నారు.


బార్లపల్లె వద్ద రెవెన్యూ అధికారులు సీజ్ చేసిన ఇసుక నిల్వలు

నాణ్యమైన ఇసుక టన్ను రూ.800

భవన నిర్మాణాలకు అవసరమైన నాణ్యమైన ఇసుక మదనపల్లెకు చేరాలంటే టన్ను రూ.800 ధర పడుతోంది. కడప వద్ద ఉన్న ఇసుక రీచ్ నుంచి పెద్దటిప్పర్ (25 టన్నుల సామర్థ్యం)తో ఇసుక మదనపల్లెకు తరలించాలంటే రూ.30 వేలు పడుతోంది. దీంతో టన్ను నాణ్యమైన ఇసుక రూ.800 పలుకుతోంది. అదే మదనపల్లె మండలం చుట్టుపక్కల ఇసుక అయితే ట్రాక్టర్ (4 టన్నుల సామర్థ్యం) రూ.2 వేల నుంచి రూ.3 వేలు పడుతోంది. ఈ ఇసుక టన్ను సరాసరిన రూ.625 ధర పలుకుతోంది.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలి..



మదనపల్లెలో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోకుంటే ఉద్యమమే చేయాల్సి వస్తుంది. ఇప్పటి వరకు పట్టణంలో నిల్వ చేసిన ఇసుక డంప్‌లను అధికారులకు చూపించాము. అయినా తూతూ మంత్రంగా విచారణ చేసి వదిలేస్తున్నారు. దీనిపై కలెక్టర్, జేసీ దృష్టికి తీసుకెళ్లాము. రాష్ట్రంలో ఉచిత ఇసుక విధానం అమలయ్యే వచ్చే నెల 6వ తేదీ వరకు అయినా అధికారులు పని చేసి అక్రమ రవాణాను అడ్డుకోవాలి.

- పి.శ్రీనివాసులు, సీపీఎం జిల్లా కార్యదర్శి

రేట్లు తగ్గకుంటే ఇళ్లు కట్టలేము..



మదనపల్లెలో ఇసక రేట్లు తగ్గకుంటే ఇళ్లను కట్టలేము. వారం రోజులుగా ఇసుక డిమాండ్ పెరిగింది. ఆఫీసర్లకు భయపడి ట్రాక్టరోళ్లు ఇసుక తోలడం లేదు. కడప నుంచి ఇసుక కొనుక్కొంటున్నాం. కానీ టన్ను ఇసుక ఎనిమిది నూర్లు పడుతోంది. పెబుత్వం వెంటనే ఇసక రేట్లు తగ్గిస్తేనే మాకు, కూలి పనులు దొరుకుతాయి. లేకుంటే ఇసక లేక, కూలిపనులు దొరక్క అగచాట్లు పడాల్సిందే.

- వెంకటేశ్, భవన నిర్మాణ కార్మికుడు, మదనపల్లె

21 టిప్పర్ల ఇసుకను సీజ్ చేశాం..

మదనపల్లె మండలం బార్లపల్లె వద్ద ఇసుక డంప్‌ను గుర్తించాము. సిబ్బందితో వెళ్లి పరిశీలించి అక్కడ ఉన్న 21 టిప్పర్ల ఇసుకను సీజ్ చేశాం. ఈ డంప్‌ను తగు చర్యల నిమిత్తం మైనింగ్ అధికారులకు అప్పగించాము. ప్రస్తుతం కొందరు చేస్తున్న ఆరోపణలపై క్షేత్రస్థాయిలో విచారిస్తున్నాము. కొందరు ఇళ్ల నిర్మాణానికి మాత్రమే ఇసుక రవాణా చేసుకుని నిల్వ చేసుకున్నట్లు మా పరిశీలనలో తెలుస్తోంది. 28 రెవెన్యూ గ్రామాల పరిధిలో వీఆర్‌వోలను అప్రమత్తం చేశాము. అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తున్న వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించాము.

- ఖాజాబీ, తహసీల్దార్, మదనపల్లె


పట్టణంలోని రోజా ఫ్లాట్లలో నిల్వ చేసిన ఇసుకపై విచారిస్తున్న తహసీల్దార్ ఖాజాబీ (ఫైల్)

నకిలీ ఎరువులతో రైతులు విలవిల..

వ్యవసాయంలో నకిలీ ఎరువులు, పురుగు మందులు, డ్రిప్ ఎరువులతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నకిలీల ధాటికి రైతన్న అతలాకుతలమై అల్లాడిపోతున్నారు. వ్యవసాయంలో సాగు చేసిన పంట దిగుబడి సమయంలో కాపు కాయక రైతన్నలు అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారు. పడమటి మండలాల్లో రైతన్నలు ఎక్కువగా టమోటా, పూలు, కూరగాయల పంటలను సాగు చేసి అప్పులను మూటగట్టుకుంటున్నారు. రైతులు సాగుచేసే పంటలకు ఎరువుల దుకాణదారులు ఇష్టానుసారంగా డ్రిప్ ఎరువులను ఇస్తున్నారు. ఈ డ్రిప్ ఎరువులను టమోటా పంటలకు వాడిన రైతులు తోటలు దెబ్బతినడంతో లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు. డ్రిప్ ఎరువులను అమ్మిన వ్యాపారి వద్దకు వచ్చి అడిగితే దిక్కున్నచోట చెప్పుకోండంటూ రైతులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారు. ఈ క్రమంలో టమోటా రైతులు పంట సాగు చేసి లక్షలాది రూపాయలు నష్టపోయి అప్పుల బాటలో పయనిస్తున్నారు.

- లక్షలాది రూపాయలు నష్టపోతున్న రైతన్న
- నట్టేట ముంచుతున్న నకిలీ డ్రిప్ ఎరువులు
- అధికారుల పర్యవేక్షణా లోపం.. రైతుల పాలిట శాపం

గుర్రంకొండ, ఆగస్టు 25: గుర్రంకొండ మండలంలో రైతులు ఎక్కువ శాతం టమోటా పంటను సాగు చేస్తారు. ఈ టమోటా పంటను కూడా ఏడాది పొడవునా కొంతమంది రైతులు సాగు చేస్తున్నారు. ఎకరా పొలంలో టమోటా పంటను సాగు చేయాలంటే రైతుకు రూ.2 లక్షలు ఖర్చు వస్తోంది. పంట సాగు ప్రారంభం నుంచి దిగుబడి వరకు ఎరువులు, పురుగు మందులు, డ్రిప్ ఎరువులను వాడాల్సిందే. ఈ క్రమంలో పంట ఏపుగా పెరగడానికి, కాయలు సైజు రావడానికి ఎక్కువ మంది రైతులు డ్రిప్ ఎరువులను వినియోగిస్తారు. అయితే గుర్రంకొండలో కొందరు వ్యాపారులు నకిలీ డ్రిప్ ఎరువులను విక్రయిస్తున్నారు. ఈ డ్రిప్ ఎరువులను పంటకు వాడిన రైతులు లక్షలాది రూపాయలు నష్టపోతున్నారు. పంట నష్టపోయిన రైతు ఎరువుల దుకాణం వద్దకు వచ్చి అడిగితే వ్యాపారులు రైతులపై దురుసుగా ప్రవర్తిస్తున్నారు. అంతేకాకుండా తమ దుకాణంలో డ్రిప్, పురుగు మందులు, ఎరువులు కొన్నట్లు ఆధారాలేమున్నాయని ప్రశ్నిస్తున్నారు. కారణం రైతులకు ఎరువుల దుకాణదారుల వద్ద కొన్న మందులకు బిల్లులు ఇవ్వడం లేదు. దీంతో వ్యాపారుల ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండాపోయింది.

విజిలెన్స్ దాడుల్లో రూ.లక్షలాది ఎరువులు సీజ్

గుర్రంకొండ పట్టణంలో ఎరువుల దుకాణదారులు నకిలీ ఎరువులు విక్రయిస్తున్నట్లు పలుమార్లు విజిలెన్స్ అధికారులకు రైతులకు ఫిర్యాదు చేశారు. దీంతో కడప జిల్లాకు చెందిన విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఇదురుబాష జూన్ 24వ తేదీ అధికారులతో కలిసి దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా దుకాణంలోని విక్రయానికి సిద్ధంగా ఉన్న రూ.8,29,100 విలువ గల 27 టన్నుల బరువు గల ఎరువుల బస్తాలు, రూ.63,882 విలువ గల 3.9 కిలోల విత్తనాలు, రూ.34 వేల విలువ గల 20 లీటర్ల పురుగుల మందులను సీజ్ చేశారు. అలాగే జూలై 2వ తేదీ మదనపల్లె వ్యవసాయ శాఖ ఏడీఏ శివశంకర్ మరోమారు ఎరువుల దుకాణాలపై దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా విజయ ఫర్టిలైజర్స్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన 302 బస్తాల యూరియాను సీజ్ చేశారు. సీజ్ చేసిన యూరియా విలువ రూ.80,483లుగా నిర్ధారించారు. అలాగే మరో ఎరువుల దుకాణమైన జువారి ఫర్టిలైజర్స్‌లో అనుమతులు లేకుండా విక్రయిస్తున్న 28 మెట్రిక్ టన్నుల వివిధ రకాల ఎరువుల బస్తాలను సీజ్ చేసినట్లు తెలిపారు. సీజ్ చేసిన ఎరువుల విలువ రూ.7.76 లక్షలుగా గుర్తించారు. అలాగే జూలై 7వ తేదీ పుడమి కిసాన్ మార్ట్‌లో ప్రభుత్వ అనుమతులు లేకుండా విక్రయిస్తున్న ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను కర్నూలు వ్యవసాయ సహాయ సంచాలకులు సాలురెడ్డి తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ క్రమంలో 1.59 మెట్రిక్ టన్నుల స్టాక్‌ను సీజ్ చేశారు. అధికారులు సీజ్ చేసిన ఎరువుల విలువ రూ.1.92 లక్షలుగా తేల్చారు.


గుర్రంకొండలో ఎరువుల దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న విజిలెన్స్ సీఐ ఇదురుబాష (ఫైల్)

నకిలీ డ్రిప్ ఎరువుతో నష్టపోయిన రైతు

గుర్రంకొండ మండలానికి చెందిన ఓ రైతు టమోటా పంట సాగు చేశాడు. పంట పూత, పిందె దశలో ఉండడంతో కాయలు సైజు రావడానికి ఓ ఎరువుల దుకాణంలో డ్రిప్ ఎరువును కొనుగోలు చేశాడు. ఈ డ్రిప్ ఎరువును రైతు టమోటా పంటకు ఎక్కించడంతో పంట దెబ్బతిని నష్టపోయాడు. ఈ క్రమంలో బాధిత రైతు వ్యాపారిని అడగడంతో డ్రిప్ ఎరువు అమ్మిన వ్యాపారి దురుసుగా ప్రవర్తించాడు. ఈ నేపథ్యంలో రైతు వ్యవసాయ, విజిలెన్స్ అధికారులను ఆశ్రయించాడు. నకిలీ డ్రిప్ ఎరువును పంటకు వాడడంతో రైతు లక్షలాది రూపాయలను నష్టపోయాడు.


అనుమతులు లేని ఎరువులను సీజ్ చేస్తున్న ఏడీఏ శివశంకర్ (ఫైల్)

నాణ్యమైన ఎరువులు విక్రయించేలా చూస్తాం..

గుర్రంకొండ మండలంలో ఎరువుల దుకాణాల్లో రైతులకు నాణ్యమైన పురుగు మందులు, విత్తనాలు, డ్రిప్ ఎరువులు విక్రయించేలా చర్యలు తీసుకుంటాం. నకిలీ ఎరువులు, పురుగుల మందులు, డ్రిప్ ఎరువులను అరికడతాం. అలాగే విజిలెన్స్ అధికారులు వివిధ దుకాణాల్లో సీజ్ చేసిన ఎరువులను వ్యవసాయ శాఖాధికారుల నుంచి అనుమతులు వచ్చే వరకు విక్రయించకుండా చూస్తాం. వ్యవసాయశాఖ అధికారుల నిబంధనలు పాటించకుంటే వారిపై చర్యలు తీసుకుంటాం.

- నవీన్‌రెడ్డి, ఇన్‌చార్జ్ వ్యవసాయశాఖ అధికారి, గుర్రంకొండ మండలం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

- కలెక్టర్ శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు

రాయచోటి (కలెక్టరేట్) ఆగస్టు 25: కృష్ణాష్టమి పండుగ సందర్భంగా సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటిలో రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్, ఎస్పీ విద్యాసాగర్ నాయుడు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. అర్జీదారులు కలెక్టర్ కార్యాలయానికి, ఎస్పీ కార్యాలయానికి రావద్దని వారు తెలిపారు.


నీటితో కళకళలాడుతున్న నాయునిచెరువు


మిగులు నీళ్లు కర్ణాటక చెరువులకు వెళ్లే విధంగా తవ్విన కాలువ

మిగులు జలాలకు చెక్

- నాయునిచెరువు కట్ట ఎత్తు పెంచిన కర్ణాటక
- 15 ఏళ్లుగా నీరు తరలింపు
- రామసముద్రం రైతుల ఆందోళన

రామసముద్రం, ఆగస్టు 25: కర్ణాటకలోని నాయునిచెరువు నిండితే మిగులు జలాలు ఆంధ్ర వైపు వచ్చేవి. పలు చెరువులు నిండి బంగారు పంటలు పండేవి. ఏటా పంటలు పండటంతో రైతుల ఇళ్లు కళకళలాడేవి. అయితే పొరుగు రాష్ట్ర అధికారులు ఆ నీటిని సరిహద్దు దాటకుండా అడ్డుకట్ట వేశారు. దీంతో 15 ఏళ్లుగా జిల్లా సరిహద్దు ప్రాంతమైన రామసముద్రం మండలం చెరువులకు చుక్క నీరందడం లేదు. ఒకప్పుడు సుభిక్షంగా ఉన్న ప్రాంతం కర్ణాటక ప్రభుత్వ స్వార్థంతో కరువు బారిన పడింది. ప్రభుత్వం స్పందించి కర్ణాటక జల చౌర్యానికి అడ్డుకట్ట వేయాలని అన్నదాతలు కోరుతున్నారు. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో కోలార్ జిల్లాలోని శ్రీనివాసపురం తాలూకా పులగూరకోట ప్రాంతంలో నాయునిచెరువు నిర్మాణం జరిగింది. భూగర్భ జలాల అభివృద్ధి లక్ష్యంగా ఆంధ్ర ప్రాంత వాసులు అప్పట్లో చెరువును నిర్మించుకున్నారు. కాగా రాష్ట్రం విడిపోవడంతో కర్ణాటక ప్రభుత్వం నాయునిచెరువు కట్ట వరకు సరిహద్దును ఏర్పాటు చేసింది. అప్పట్లో మిగులు జలాలు ఆంధ్ర రాష్ట్ర సరిహద్దు ప్రాంతం రామసముద్రం మండల పరిధిలోని పలు చెరువులకు చేరేవి. 15 ఏళ్ల కిందట ఈ చెరువు ప్రాంతంలో కర్ణాటక ప్రభుత్వం ప్రాజెక్టు నిర్మించి మిగులు జలాల తరలింపును అడ్డుకుంది.

పొరుగు రాష్ట్రం ఏమి చేసిందంటే..

రామసముద్రం మండలం నారిగానిపల్లె పంచాయతీ కొత్త ఇండ్లు సమీపంలోని కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో 2011 అక్టోబరులో కర్ణాటక ప్రభుత్వం ఓ ప్రాజెక్టును నిర్మించింది. ఆ మేరకు నాయునిచెరువు కట్ట ఎత్తు పెంచి తూమును పూడ్చింది. అంతటితో ఆగకుండా 60 అడుగుల లోతుతో కాల్వ తవ్వి రూ.కోటి వ్యయంతో సర్‌ప్లస్ చానెల్‌ను నిర్మించింది. దీంతో ఈ చెరువు నిండి రామసముద్రం వైపు వచ్చే మిగులు జలాలను కర్ణాటక ప్రాంతంలోని రంగమ్మచెరువుకు మళ్లించారు. అప్పటి నుంచి రామసముద్రం మండలంలోని కదిరాయచెరువు, కొత్తచెరువు, కమ్మవానికుంట, వడ్డివానికుంట, మాదిగవానికుంట, నారిగానిపల్లె చెరువు, చెల్లాయు తదితర చెరువులకు చుక్క నీరు అందని పరిస్థితి ఏర్పడింది. పొరుగు రాష్ట్ర జలచౌర్యంపై అప్పట్లో మదనపల్లె ఎమ్మెల్యేలు షాజహాన్‌బాషా, దేశాయ్ తిప్పారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సాగర్‌రెడ్డి, సీపీఐ నాయకులు హరినాథ్‌రెడ్డి, ఏపీ నీటి సంరక్షకుడు నటరాజ తదితరులు అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి విన్నవించారు. పలు నివేదికలు ప్రభుత్వానికి అందజేసినా ఉద్యమాలు నిర్వహించినా ప్రయోజనం లేకుండాపోయింది. అప్పట్లో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరిపినా ఫలించలేదు. అప్పటి నుంచి మండల పరిధిలోని చెరువులు, కుంటలు నిండక బోరుబావుల్లో నీటిమట్టం తగ్గిపోయింది. భూగర్భ జలాలు అడుగంటి వేలాది ఎకరాల భూములు బీళ్లుగా మారాయి. ఎంతోమంది రైతులు కూలీలుగా మారి ఇతర రాష్ట్రాలకు వలస బాట పట్టారు. కూటమి ప్రభుత్వం స్పందించి కర్ణాటక జల చౌర్యాన్ని అడ్డుకోవాలని రామసముద్రం మండల రైతులు కోరుతున్నారు. నాయునిచెరువు మిగులు జలాలతో స్థానిక చెరువులు నింపి సాగునీటి ఇబ్బందులు తీర్చాలని కోరుతున్నారు.

కర్ణాటక మిగులు జలాలు రాక వెలవెలపోతున్న ఏపీలోని చెంబకూరు వద్ద ఉన్న కదిరాయచెరువు




మాదిగల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- సదస్సులో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, ఆగస్టు 25: మాదిగల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ఎన్జీవో హోంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రామాంజనేయులుమాదిగ అధ్యక్షతన నిర్వహించిన మాదిగల ఆత్మీయ సదస్సుకు మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీ ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి రాష్ట్రాలకు అధికారం ఇవ్వడాన్ని అభినందిస్తూ అందుకు సహకరించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ క్రమంలోనే వర్గీకరణ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని అంతవరకు ఉద్యోగ నియామకాలు నిలుపుదల చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అంతేగాక గత ప్రభుత్వం ఎస్సీల పట్ల అనుచితంగా వ్యవహరించి సుమారు 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి ఎస్సీల అభివృద్ధిని అడ్డుకున్నారని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం ఆ అడ్డంకులను తొలగించి గత ప్రభుత్వంలో రద్దయిన 27 సంక్షేమ పథకాలను అమలుపరచాలని ముఖ్యమంత్రికి తెలియచేయాలని కోరారు. మంత్రి మాట్లాడుతూ మాదిగల రిజర్వేషన్లకు ఎలాంటి భంగం కలుగకుండా ఎమ్మార్పీఎస్‌కు కేటాయించిన ఉద్యోగాలు మాదిగలకు దక్కేటట్లు చర్యలు చేపడతామన్నారు. మాదిగల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు. రాబోవు రోజుల్లో రాయచోటి పట్టణంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు నా వంతు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు రామాంజనేయులు, జిల్లా గౌరవాధ్యక్షుడు రమణయ్య, జిల్లా నాయకులు ఆంజనేయులు, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు అబ్బవరం హరిబాబు, మాజీ సెక్రటరీ రాజా, న్యాయవాదుల అధ్యక్షుడు వెంకట్రమణ, ఉద్యోగ విభాగం నాయకులు ఈశ్వరయ్య, జిల్లా అధ్యక్షుడు నరసింహులు, ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకుడు సుబ్బయ్య, చిన్నమండెం నాయకుడు లక్ష్మయ్య, రమణ, వీరబల్లి నాయకులు శివ, రాంమోహన్, బాలరాజు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.


మాదిగల ఆత్మీయ సదస్సులో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి

కంటబడిందా... ఇక గోవిందా

ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్ల చోరీలతో హడలిపోతున్న రైతులు ● పంపుసెట్ల వద్దే నిద్ర
● పట్టించుకోని విద్యుత్ అధికారులు ● గస్తీపెంచి చోరీలు అరికడతాం : సీఐ

చెన్నూరు, ఆగస్టు 25: లక్షల రూపాయలు ఖర్చు పెట్టి పొలాల వద్ద ఏర్పాటు చేసుకున్న మోటార్లు కనిపిస్తే గోవిందా అని అనాల్సిందే. చూపుపడిందంటే అది మాయమవ్వాల్సిందే. ట్రాన్స్‌ఫార్మర్లు, మోటార్ల చోరీలతో హడలిపోతున్న రైతులు భయంతో పంపుసెట్ల వద్దే నిద్ర పోతున్నకాలాలు. బోర్లు ఏర్పాటు చేసుకుంటే కాల్వలకు నీరు వచ్చినా రాకపోయినా రెండు సీజన్లలోనూ పంటలు పండించుకోవచ్చనే ఆలోచన వారిది. వచ్చే ఆదాయంతో కుటుంబ పోషణ, పిల్లల చదువు, పెళ్లిళ్లకు ఉపయోగపడుతుందని మోటార్లు బిగించుకుంటే అవి కాస్త దొంగలపాలవుతున్నాయి. ఒక్క వ్యవసాయ మోటరు చోరీకి గురైనా, ట్రాన్స్‌ఫార్మర్లను పగలగొట్టినా రైతు రూ.2లక్షల నుంచి రూ.2.50లక్షలు నష్టపోవాలి. అప్పు చేసిన రైతులు దొంగల దెబ్బకు విలవిల్లాడుతున్నారు. దిక్కుతోచక దొంగలు ఎప్పుడు పడతారో అన్న భయంతో పంపుసెట్ల వద్దే రాత్రివేళ నిద్రపోవాల్సిన పరిస్థితి దాపురించిందని రైతులు వాపోతున్నారు. వివరాల్లోకెళితే..

మండల వ్యాప్తంగా 240 సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌పార్మర్లు, 1600 వ్యవసాయ ట్రాన్స్ ఫార్మర్లు ఉన్నాయి. వీటిలో కాస్త పొలాల వైపు ఏవైనా ఉన్నా రోడ్డుకు దూరంగా ఉన్నా వీటిపై దొంగలు కన్నేస్తున్నారు. సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌పార్మర్లు పగుల గొట్టితే వీటి వల్ల ఆ ప్రాంతంలో గృహ వినియోగం, వీధిలైట్లకు తీవ్ర ఇబ్బంది. దాని ధర లక్షా 60వేల నుంచి లక్ష 70వేల వరకు ఉంటుంది. అదే 2 ఫేజ్, 3 ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు పగులగొడితే రైతుకు తీవ్ర ఇబ్బంది. మళ్లీ కొత్తవి కొనాలంటే తలప్రాణం తోకకు వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాదిగా మండల వ్యాప్తంగా వ్యవసాయ పంపు సెట్లకు కనెక్షన్ ఇచ్చుకునే వైర్లు మీటర్ల కొద్దీ దొంగతనాలు జరిగాయి. ఎందరో రైతులు తమ పంపు సెట్టుకు ఉన్న 50మీటర్లు వైరు, 100 మీటర్లు చోరీ అయిందని పలురకాలుగా చెబుతున్నారు, ఫిర్యాదులు చేస్తునే ఉన్నారు. అయితే అవి రికవరీ కావడం అతి తక్కువే. ఎందుకంటే చోరీ చేసిన వ్యక్తి వాటిని ఎవరికి అమ్ముతున్నారో తెలియదు, ఏం చేస్తున్నాడో తెలియదు, పైగా వాటి విలువ ట్రాన్స్‌ఫార్మరుతో పోల్చుకుంటే తక్కువే కాబట్టి కొందరు రైతులు సైతం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయకపోవడం, ఒక వేళ చేసినా పెద్దగా ఫలితం లేకపోవడంతో మిన్నకుంటున్నారు. ఇటీవల సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌పార్మర్ల చోరీ మరీ ఎక్కువైంది. వీటిని పగులగొడితే అందులోని 50 నుంచి 60లీటర్ల ఆయిల్ వృథాగా నేలపై పోయడం, అందులో పది కిలోల కాపర్ వైరు తీసుకెళ్లి అమ్ముకుంటారు. అయితే ట్రాన్స్‌పార్మరు విలువ రూ.లక్షా 60వేలు ఉంటే చోరీ చేసిన వ్యక్తి పది కిలోల కాపర్ వైరు అమ్ముకుంటే కిలో రూ.700 లెక్కన పది కిలోలకు రూ.7వేలు వస్తుంది. అతనికి వచ్చేది రూ.7వేలు అయితే ట్రాన్స్‌పార్మరు పగులగొట్టడంతో నష్టం రూ.లక్షా 70వేలు. ఇటీవలే తోళ్లగంగనపల్లె వద్ద దుగ్గనపల్లె, మదీనా కాలేజీ, శేషయ్యగారిల్లె సమీపంలో ట్రాన్స్‌పార్మర్లు పగలగొట్టి కాపర్ వైరు చోరీ జరిగింది. అంతేకాక 2 ఫేజ్ ట్రాన్స్‌పార్మరు, ఒకటి త్రీఫేజ్ పగలగొట్టారు. వీటి ద్వారా రైతుకు పెద్దనష్టమే జరిగింది. అటు గృహ వినియోగదారులకు, ఇటు రైతులకు నష్టం కలిగిస్తున్న దొంగలపై చర్యలు తీసుకోవాలంటూ ఎంతో కాలంగా రైతులు, వినియోగదారులు కోరుతూనే ఉన్నారు.



శేషయ్యగారిపల్లె వద్ద పగులగొట్టబడిన ట్రాన్స్‌ఫార్మరు



స్తంభం నుంచి చోరీకి గురైన సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మరు

దొంగతనాలపై ఫిర్యాదు చేస్తూనే ఉన్నాం



మండలంలో సింగిల్‌ఫేజ్, 2ఫేజ్, త్రీఫేజ్ ట్రాన్స్‌ఫారాలు పగులగొట్టడంతో పలుమార్లు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినా రికవరీ లేదు. ఇప్పుడు కూడా ట్రాన్స్‌ఫార్మర్లు పగుల గొడుతూనే ఉన్నారు. వీటిపై పోలీసుశాఖ ప్రత్యేక దృష్టి సారించాలి. లేదంటే రైతులు, వినియోగదారులకు తీరని నష్టం జరుగుతుంది. సింగిల్‌ఫేజ్ ట్రాన్స్‌ఫార్మరు కొనాలంటే ప్రతి మారు లక్షా 60వేలు పెట్టాలి. ఎన్నిమార్లు దొంగతనాలు జరిగి పగులగొట్టినా అన్ని మార్లు డబ్బు ఎలా వస్తాయి. ఈ దొంగతనాలు అరికట్టకపోతే భవిష్యత్తులో ఇబ్బందే.

- రామలింగారెడ్డి, ఏఈ, ట్రాన్స్‌కో

మోటార్ల వద్దే నిద్రపోతున్నాం



ఇటీవల జరిగే దొంగతనాలు చూస్తుంటే భయం వేస్తోంది. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. మోటర్లు చోరీ చేస్తే చిన్న, సన్న కారు రైతులు ఎలా బతకాలి. మోటారు కొనాలంటే కనీసం రూ.50వేలు పెట్టుబడి పెట్టాలి. మండలంలో ఇటీవల మోటార్ల దొగతనాలు ఎక్కువవవుతున్నాయని రైతులు వాపోతూనే ఉన్నారు. రామనపల్లె, ముండ్లపల్లె పొలాల్లో ఇటీవల ఓ రైతుకు చెందిన పాత, కొత్త మోటరు రెండూ చోరీకి గురయ్యాయి. ముండ్లపల్లె వద్ద వ్యవసాయ మోటారు ఒకటి చోరీకి గురైంది. ఇవ న్నీ చూస్తుంటే మాకు నిద్ర ఎలా పడుతుంది.

- గుర్విరెడ్డి. రైతు, కొండ పేట

గస్తీ పెంచి చోరీలు అరికడతాం



ట్రాన్స్‌పార్మర్లు పగుల గొట్టారని ట్రాన్స్‌కో ఏఈ ఫిర్యాదు చేశారు. దొంగతనాలు చేయడం వల్ల అందరికీ నష్టమే. తాను విధుల్లో చేరి నాలుగు రోజులైంది. ప్రతి ఫిర్యాదు తీసుకుంటా. గ్రామాల్లో మరింత గస్తీ పెంచి నిత్యం పరిరక్షించడం జరిగేలా చూస్తాం. ఉన్నతాధికారులతో మాట్లాడి గస్తీ చేసేందుకు అదనపు సిబ్బందిని ఏర్పాటు చేస్తాం. రాత్రివేళ సైతం పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండి ఆయా ప్రాంతాల్లో రైతులతో మాట్లాడుతుంటాం. మోటార్లు, స్టాటర్లు దొంగతనాలకు గురికాకుండా తన వంతు గట్టి ప్రయత్నం చేస్తాం.

- ఆర్.పురుషోత్తంరాజు, సీఐ, చెన్నూరు

వైభవంగా వద్దిబోయినవారి వివాహ రిసెప్షన్ వేడుక



నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

బద్వేలుటౌన్, ఆగస్టు 25: ప్రముఖ స్పెషల్‌క్లాస్ కాంట్రాక్టర్ వద్దిబోయిన ప్రసాద్‌రెడ్డి, ప్రమీలమ్మ దంపతుల ఏకైక కుమార్తె డాక్టర్ సాయినవ్య, డాక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి వివాహ రిసెప్షన్ వేడుక ఆదివారం ఆర్‌ఆర్ కన్వెన్షన్ కల్యాణమండపంలో అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ప్రముఖ రాజకీయ నేతలు ప్రజలు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. దేవాదాయశాఖామంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టాసుధాకర్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు మల్లెల లింగారెడ్డి, విజయమ్మ, టీడీపీ యువనేత రితేష్‌కుమార్‌రెడ్డి, వద్దిబోయిన సాయికిరణ్ రెడ్డి, పాల మల్లికార్జునరెడ్డి, గోపవరం జడ్పీటీసీ జయరామిరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, ఏసీఎన్ డిజిటల్ నెట్‌వర్క్ చైర్మన్ రాగిమాను ప్రతాప్‌కుమార్, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మిత్తికాయల రమణాయాదవ్, మాజీ ఎంపీపీ భైసాని ప్రతాప్‌రెడ్డి, టీడీపీ నేతలు కొండయ్య, రామానాయుడు, నిమ్మకాయల గోపాల్‌రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి, కాసా వెంకటసుబ్బారెడ్డి, వివేకానందరెడ్డి, రామసుబ్బారెడ్డి, రామక్రిష్ణారెడ్డి, దేవరాజు, సమ్మెట అబ్రహాం, ఐజయ్య తదితరులు 5వేల మందికిపైగా పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో అరటితోట దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

కాశినాయన ఆగస్టు 25: సావిశెట్టిపల్లె రెవెన్యూ పొలంలో ఆదివారం షార్ట్ సర్క్యూట్‌తో దాదాపు 9 ఎకరాల్లో అరటి తోట కాలిపోయినట్లు బాధిత కుటుంబీకులు, గ్రామస్తులు తెలిపారు. స్థానికుల వివరాల మేరకు నల్లేరుకొట్టాలకు చెందిన రైతులు లెక్కల బాలసుబ్బారెడ్డి 5ఎకరాలు, రాజేశ్వరి 4 ఎకరాల్లో అరటి సాగు చేశారు. ఆదివారం షార్ట్ సర్క్యూట్‌తో తోటలో మంటలు చెలరేగాయి. గుర్తించి రైతులు పోరుమామిళ్ళ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వగా వారు మంటలను ఆర్పారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిందని రైతుల వాపోయారు.

స్టెప్స్‌తో అదరగొట్టిన చిన్నారులు



కడప (కల్చరల్) ఆగస్టు 25: కడప నగర చిన్నారులు ఆదివారం నగర రిమ్స్ సమీప శిల్పారామంలో వివిధ సినిమా, జానపద, శాస్త్రీయ, దేశభక్తి పాటలకు వేసిన స్టెప్స్ ప్రేక్షకులను అలరించాయి. ఆట విడుపులో భాగంగా అక్కడి సాంస్కృతిక కళావేదికపై పరిపాలనాధికారి పి. శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షణలో మిస్బా మూవీ సహకారంతో అఖిల్ అకాడమీ చిన్నారులు వేసిన నృత్యాలు ప్రేక్షకులను అలరించాయి. ఇందులో చీమ దసరా చిన్నోడు, చినుకు చినుకు అందెలతో అనే పాటలు ఆకుట్టుకున్నాయి.

ఏపీ ఎంఆర్‌టీ చెస్ విజేతగా జశ్వంత్

కడప (స్పోర్ట్స్) ఆగస్టు 25: అశ్రఫ్ ప్రసన్న మంత్లీ రోలింగ్ ట్రోఫీ (ఏపీఎంఆర్‌టీ) చెస్ విజేతగా నూకల జశ్వంత్ నిలిచారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కడప పాలెంపాపయ్య వీధిలోని అనీస్ దర్బారీ చెస్ అకాడమీలో నిర్వహించిన జిల్లా స్థాయి చెస్ టోర్నమెంట్‌లో ద్వితీయ విజేతగా జతిన్‌కుమార్, తృతీయ విజేతగా ప్రభుదేవా నిలిచినట్లు జిల్లా కార్యదర్శి అనీస్ దర్బారీ వెల్లడించారు. ఇందులో జిల్లా నలుమూలల నుంచి సుమారు 50 మంది చెస్ క్రీడాకారులు పాల్గొన్నట్లు వెల్లడించారు. కాగా విజేతలకు బహుమతులను అనీస్‌దర్బారీ, అందజేశారు.

మిలటరీ స్కూల్స్ ప్రవేశపరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఆగస్టు 25: జాతీయస్థాయిలో 2025-26 విద్యాసంవత్సరానికి రాష్ట్రీయ మిలటరీ స్కూల్స్‌లో 6, 9 తరగతుల్లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశపరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం పోటీపరీక్షల ఉచిత సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథ రెడ్డి పేర్కొన్నారు. ఈపరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు వయసు ఆధారంగా 5 నుంచి 9 తరగతులు చదివే బాల, బాలికలకు అవకాశం ఉందని, వచ్చేనెల 19వ తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. ప్రవేశపరీక్షా విధానం, దరఖాస్తు వంటి ఇతర వివరాలకోసం తిరుపతిలో వరదరాజనగర్‌లోని విశ్వంస్కూల్‌లోగానీ లేదా 86888 88802/ 93999 76999 ఫోన్ నెంబర్లని సంప్రదించాలని కోరారు. కాగా జాతీయ స్థాయిలో నిర్వహించే పలు పోటీపరీక్షలకు దరఖాస్తు గడువుతేదీ, విద్యార్హత వంటి వివరాలు ఈవిధంగా ఉన్నాయి.

కోర్సు	ప్రవేశం	దరఖాస్తుకుచివరితేదీ
నవోదయ	6వతరగతి	16-09-2024
ఆర్ఐఎంసీ	8వతరగతి	30-09-2024
మిలటరీస్కూల్స్	6 నుంచి 9తరగతులు	19-09-2024

గుర్తు తెలియని వాహనం ఢీ - వ్యక్తి మృతి

చెన్నూరు, ఆగస్టు 25: రాజంపేట బైపాస్‌రోడ్డులో బచ్చుంపల్లె వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నవాజ్ (27) మృతి చెందాడు. వల్లూరు మండలం మిట్టపల్లెకు చెందిన నవాజ్ కడప నగరం చిన్నచౌకు పరిధిలో చిన్న కొట్టు ఏర్పాటు చేసుకుని రోజూ కడపకు వెళ్లి వచ్చేవాడు. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం కడపకు వచ్చిన ఆయన తిరిగి రాత్రి వెళుతుండగా బచ్చుంపల్లె సమీపంలో ఆయన వాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన అతన్ని చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు. అంతలోనే అతడు మృతి చెందాడు. సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెన్నూరు పోలీసులు తెలిపారు.

ప్రజా దర్బార్ ద్వారా ప్రజాసమస్యలు పరిష్కారం

మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

చిన్నమండెం, ఆగస్టు 25: ప్రజా దర్బార్ ద్వారా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తున్నట్లు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో మంత్రి మాట్లాడుతూ ఎన్నో ఏళ్లగా రాయచోటి ప్రాంతంలో సమస్యలు పరిష్కారానికి నోచుకోక ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొనే వారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజా దర్బార్ ద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టామన్నారు. అన్నమయ్య జిల్లాలో ఎక్కువగా గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలు, భూకబ్జాలు మీద ఫిర్యాదులు వస్తున్నాయని వీటిపై ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

ఎర్రగుంట్ల, ఆగస్టు 25: ఎర్రగుంట్ల బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న చందు(14) అనే విద్యార్థిని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. శనివారం కడుపు నొప్పి వచ్చిందని మాత్రలు మింగినా తగ్గలేదు. అయితే తల్లిదండ్రులు సరైన వైద్యం చేయించలేదని మనస్తాపం చెంది ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. అది గమనించిన తల్లిదండ్రులు ప్రొద్దుటూరు ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

218 పరుగుల ఆధిక్యంలో చిత్తూరు



విజయ్‌రామిరెడ్డి (కడప)



నిఖిత్ (చిత్తూరు)



రెడ్డి ప్రకాశ్ (చిత్తూరు)



మనోజ్‌రాజు (కర్నూలు)

కడప (స్పోర్ట్స్) ఆగస్టు 25: కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్-23 మెన్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్ రెండో రోజు ఆదివారం చిత్తూరు జట్టు 218 పరుగుల ఆధిక్యతతో వుండగా, మరో మ్యాచ్‌లో వి జయానికి 272 పరుగుల దూరంలో నెల్లూరు జట్టు ఎదురీదుతోంది.

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో...

కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప-చిత్తూరు జట్ల నడుమ సాగుతున్న మ్యాచ్‌లో చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 395 పరుగులు చేయగా బ్యాటర్ నిఖిత్ 60 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్న సంగతి తెలిసిందే.

రెండో రోజు బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 12.1 ఓవర్లకు మొత్తంగా 102.1 ఓవర్లకు 7 వికెట్లు కోల్పోయి 450 పరుగులకు డిక్లేర్ చేసింది. 60 పరుగులతో నాటౌట్ బ్యాట్స్‌మెన్ నిఖిత్ 93 పరుగులు చేశారు. కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 64.5 ఓవర్లలో 245 పరుగులకు ఆలౌట్ అయింది. విజయ్‌రామిరెడ్డి (బ్యాటర్) 83 పరుగులు చేశారు. చిత్తూరు జట్టు బౌలర్ రెడ్డిప్రకాశ్‌కు 5 వికెట్లు లభించాయి. రెండో ఇన్నింగ్స్‌కు దిగిన చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 8 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 13 పరుగులు చేసింది. దీంతో చిత్తూరు జట్టుకు 218 పరుగుల ఆధిక్యత లభించింది.

ఏసీఏ క్రికెట్ మైదానంలో...

ఏసీఏ క్రికెట్ మైదానంలో నెల్లూరు- కర్నూలు జట్ల నడుమ సాగుతున్న మరో మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 62 ఓవర్లలో 259 పరుగులకు ఆలౌట్ కాబడింది. నెల్లూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 18 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 87 పరుగులు చేసింది. రెండో రోజున బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మరో 17.2 ఓవర్ల పాటు బ్యాటింగ్ చేసి మరో 87 పరుగులు జోడించి మొత్తంగా 174 పరుగులకు ఆలౌట్ అయ్యారు. దీంతో కర్నూలు జట్టుకు మొదటి ఇన్నింగ్స్‌లో 85 పరుగుల ఆధిక్యత లభించింది. రెండో ఇన్నింగ్స్‌కు దిగిన కర్నూలు జట్టు 48.1 ఓవర్లలో 237 పరుగులకు ఆలౌట్ అయింది. మనోజ్‌రాజు (బ్యాటర్) 86 పరుగులు చేయగా మరో బ్యాటర్ షేక్ ఇస్మాయిల్ 51 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచారు. మొత్తంగా కర్నూలు జట్టు 322 పరుగుల ఆధిక్యత సాధించింది. కాగా విజయానికి 323 పరుగుల లక్ష్యంగా బరిలోకి దిగిన నెల్లూరు జట్టు తన రెండో ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి 10 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 51 పరుగులతో నిలిచింది. ఇందులో షేక్ అబ్బాస్ 31 పరుగులతో ఎస్ వర్మ 15 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. విజయానికి నెల్లూరు జట్టు మరో 272 పరుగులు చేయాల్సివుంది. సోమవారం ఆటకు చివరిరోజు.

లఖ్‌పతి దీదీతో ఆర్థిక పరిపుష్టి

జిల్లాలో 6479 మందికి లఖ్-పతి దీదీ ప్రొటెన్షియల్ సర్టిఫికెట్లు పంపిణీ : కలెక్టర్ శివశంకర్



మహిళా సంఘాలకు మెగా చెక్‌ను అందజేస్తున్న కలెక్టర్ శివశంకర్

కడప(కలెక్టరేట్) ఆగస్టు25: మహిళా సాధికారత సాధనతోనే కుటుంబాల ఆర్థిక వ్యవస్థ పరిపుష్టి, సమాజం అభివృద్ధి పథంలో నడుస్తోందని కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. ఆదివారం మహరాష్ట్రలోని జెల్గాన్ నుంచి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లఖ్‌పతి దీదీ కింద మహిళలను సత్కరించే కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో దేశ వ్యాప్తంగా ప్రధాని మోదీ ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలు నుంచి కలెక్టర్ మాట్లాడుతూ మహిళల స్వయం సమృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి మహిళ సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. లఖ్‌పతి దీదీ పథకం దేశ ప్రధానినరేంద్ర మోదీ తీసుకురావడం మహిళల అదృష్టమన్నారు. ప్రభుత్వం అందించిన లక్ష రూపాయిల రుణాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యం ఉన్న రంగంలో యూనిట్లను ప్రారంభించి జీవనోపాధి పెంచుకోవాలన్నారు. లఖ్‌పతి దీదీ అంటే లక్ష రూపాయలు లేదా అంతకంటే ఎక్కువ వార్షిక కుటుంబం ఆదాయాన్ని ఆర్జించే ఒక స్వయం సహాయక సంఘం సభ్యురాలని, ఈ ఆదాయం సగటు నెలవారీ ఆదాయం పదివేలు మించి ఉండేలా చూడడమే ఈ పథక లక్ష్యమన్నారు. కనీసం నాగు వ్యవసాయ రుతువులు లేదా వ్యాపారాలకు వర్తిస్తుందన్నారు. మహిళలు స్థిరమైన జీవనోపాధి పద్ధతులను వనరులను సమర్థవంతంగా నిర్వహించి మంచి జీవన ప్రమాణాన్ని మెరుగుపరిచేందుకే ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామన్నారు. వంద రోజుల ప్రణాళిక లో భాగంగా కేటాయించిన లక్ష్యాన్ని సాధించారన్నారు. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, ఉన్నత సామాజిక పెట్టుబడినిధి ద్వారా లఖ్ -పతి దీదీలకు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. పండ్ల తోటల పెంపకం, చేపలు, పశు పెంపకాలకు, శాఖల సమన్వయంతో లఖ్ -పతి దీదీలను లక్ష్యాధి కారులను చేస్తామన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాలో 107.972 ప్రొటెన్షియల్ లఖ్‌పతి దీదీలకు రుణ సదుపాయం కల్పించే లక్ష్యంగా నిర్ణయించామన్నారు. జిల్లాలో నడుస్తున్న గ్రామ సమాఖ్యకు 5-10 చొప్పున 6479 మందిని గుర్తించి అందులో 2154 మందికి సీఐఎఫ్ లఖ్‌పతి దీదీలకు రూ.11.13కోట్లు మంజూరు చేశా మన్నారు. బ్యాంకు లింకేజీ ద్వారా 7902 మందికి రూ.94.45 కోట్లు మంజూరు జరిగిందన్నారు. కార్యక్రమంలో 6479 మంది లఖ్‌పతి దీదీలకు కలెక్టర్ ద్వారా సర్టిఫికెట్లు అందజేశారు. డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, ఎల్డీఎం జనార్ధనం, స్వయం సహాయక సంఘాలు, మహిళలు పాల్గొన్నారు.

జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి సొంత భూమిలో కమ్యూనిటీ భవనం



కమ్యూనిటీ భవనం భూమిపూజ చేస్తున్న జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి దంపతులు

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 25: ఆంధ్రప్రదేశ్ లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి స్వగ్రామం టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లె సమీపంలోని సొంత భూమిలో కమ్యూనిటీ భవనం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన ప్రసిద్ధిగాంచిన సంగమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణలో రూ.10 లక్షలతో ఆదివారం భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. సంగమేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త రామాంజనేయరెడ్డి, ములకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, టి.సదుం పంచాయతీ సర్పంచ్ శారద అధ్యక్షతన ముఖ్య అతిథులుగా లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి, స్వర్ణలత రెడ్డి దంపతులు హాజరై ఆలయ ప్రాంగణలోని సొంత భూమిలో భవన నిర్మాణం చేపట్టేందుకు భూమిని ఆలయానికి కేటాయించామన్నారు. సంగమేశ్వరస్వామి తమ కుటుంబానికి ఆరాధ్య దైవమని ఆలయ అభివృద్ధిలో భాగంగా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

అనంతరం టి.సదుం గ్రామస్తులు ఏర్పాటు చేసిన సన్మాన సభలో లోకాయుక్త జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి తంపతులను సర్పంచ్, గ్రామస్థులు ప్రత్యేకంగా శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం లోకాయుక్త జస్టిస్ నుంచి టి.సదుం గ్రామానికి చెందిన గ్రూపు సభ్యులకు 4.5 లక్షల చెక్‌ను అందించారు. కార్యక్రమంలో మనోజ్‌జయంత్‌రెడ్డి, బి.కొత్తకోట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, తంబళ్లపల్లె నియోజకవర్గం పోల్ మేనేజ్మెంట్ అధ్యక్షుడు కుడుం శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, ములకలచెరువు టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్దా, పెద్దమండ్యం అధ్యక్షుడు బిల్డర్ రమణ, నాయకులు బూర్లపల్లె సుధాకర్‌రెడ్డి, బస్సు బయ్యారెడ్డి, తాడిగోళ్లపల్లె సుధాకర్‌రెడ్డి ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

● మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

గాలివీడు, ఆగస్టు 25: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పేరంపల్లె పంచాయతీ కరణంరెడ్డివారిపల్లెలో మాజీ మండల ఉపాధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డి, కుమారులు ధర్మారెడ్డి, నాగభూషణ్‌రెడ్డిలు ఇచ్చిన విందు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో చాలా వరకు రైతుల భూములు కబ్జాలకు గురయ్యాయని తెలిపారు. త్వరలో రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేస్తున్నామని, భూసమస్యలను పరిష్కరించడానికి ఇది వేదికగా ఉపయోగపడుతుందన్నారు. అనంతరం మాజీ ఎంపీపీ వెంకటనారాయణరెడ్డి ఇచ్చిన తేనేటి విందు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి, పూలుకుంట సర్పంచ్ పార్థసారధిరెడ్డి, మాజీ సర్పంచులు మహమ్మద్‌రియాజ్, ఫరీద్‌బాషా, శ్రీనివాసరాజు, జగన్నాథ్‌రెడ్డి, భద్రప్పనాయుడు, ప్రభాకర్‌నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు లక్ష్మయ్య, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రామాపురం: మండలంలోని హసనాపురం పంచాయతీ గొల్లపల్లిలో ఆదివారం పప్పిరెడ్డి రఘునాధరెడ్డి మనువరాలు, పప్పిరెడ్డి లోకేశ్‌కుమార్‌రెడ్డి, కుమార్తె చిన్నారి ఇషితారెడ్డి కేశఖండన కార్యక్రమానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, కడప ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవిరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి, లక్కిరెడ్డిపల్లె మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డిలు హాజరై చిన్నారి ఇషితరెడ్డిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా హసనాపురం గ్రామస్తులు వారికి ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన మాజీ మంత్రి రాజగోపాల్‌రెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే మాధవిరెడ్డి, శ్రీనివాసరెడ్డిలు పాలాభిషేకం, నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, గ్రామ కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: రాయచోటి పట్టణ పరిధిలోని పాతగొల్లపల్లెలో ఆదివారం జరిగిన శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాదవులకు, హిందూ బంధువులకు శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పండుగ చాలా పవిత్రమైనదని, అందరూ కలిసి మెలిసి ఐకమత్యంతో చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ పెద్దరెడ్డెయ్య, చిన్నరెడ్డెయ్యయాదవ్, అమర, ఆంజనేయులు, శ్రీనివాసులు, నరసింహులు, యాదవ ఎంప్లాయీస్ అధ్యక్షుడు నాగేంద్రబాబు, శ్రీనివాసులు, రామాంజులు, రవి, రామచంద్ర, నాగరాజ, రామయ్య పాల్గొన్నారు.



పేరంపల్లెలో ప్రజా సమస్యలపై ఆరాతీస్తున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

సమస్యలపై దృష్టి సారిస్తాం: సుగవాసి



సుండుపల్లెలో మహిళలకు చెక్కును అందజేస్తున్న బాలసుబ్రమణ్యం

రాజంపేటటౌన్, ఆగస్టు 25: రాజంపేట నియోజకవర్గం గుండ్లూరు పంచాయతీలోని పలు సమస్యలను ఆదివారం టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం దృష్టికి గ్రామస్థులు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళా సంఘాలు, ఫీల్డ్ అసిస్టెంట్ ఇబ్బందులు, అనేక సంవత్సరాలుగా గ్రామంలో సిమెంట్‌రోడ్లు లేవని, తాగునీటి సమస్య ఉందని వారు వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని, ప్రత్యేక నిధులు పంచాయతీల ద్వారా అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, రాజంపేట పట్టణ మాజీ అధ్యక్షుడు సంజీవరావు, రాజంపేట రూరల్, మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఆర్‌టీడీ ఫిజికల్ డైరెక్టర్ షామీర్‌బాషా, రాష్ట్ర బీసీసెల్ అధికార ప్రతినిధి శ్రీధర్‌బాబు, నాగేశ్వర, శివప్రసాద్, నారాయణ, గ్రామ ప్రజలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం

సుండుపల్లి, ఆగస్టు 25: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తేనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని టీడీపీ ఇన్‌చార్జ్ సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. ఆదివారం గ్రామీణ సహాయక సంఘాలలోని డ్వాక్రా మహిళలను లక్షాధికారులుగా చేయడమే లక్ష్యంగా మండలంలోని వెలుగు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలో 28 స్వయం సహాయక సంఘాల నుంచి 282 మంది నిరుపేద మహిళలను గుర్తించి రూ.2.82 కోట్ల చెక్కును అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాజమ్మ, మండల టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జ్ శివకుమార్ నాయడు, వెలుగు సిబ్బంది, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

వైద్యులకు రక్షణ కల్పించాలి: ఐఎంఏ



డాక్టర్ బాలరాజు దంపతులను సన్మానిస్తున్న ఐఎంఏ అసోసియేషన్ సభ్యులు

రాజంపేటటౌన్, ఆగస్టు 25: వైద్య వృత్తిద్వారా ఆపదలో ఉన్నవారిని కాపాడాల్సిన వారే నేడు ప్రమాదంలోకి వెళ్తున్నారని, డాక్టర్లకు రాష్ట్రంలో రక్షణ కల్పించాలని ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు డిమాండ్ చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా సంగరాజు బాలరాజు ఈ మధ్యే ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో ఆదివారం పట్టణంలోని కళ్యాణమండపంలో వారి దంపతులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా డాక్టర్లపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కలకత్తాలో వైద్య కళాశాల విద్యార్థినిపై జరిగిన దాడి సంఘటన మొదలు తిరుపతిలో ఓ జూనియర్ డాక్టర్‌పై అనేకం చోటు చేసుకుంటున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండింటిపై రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించకపోతే వైద్యవృత్తి ప్రమాదంలో పడుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్లపై జరుగుతున్న దాడులను ముక్తకంఠంతో ప్రతిఒక్కరూ పోరాడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీహరి, జి.రవిక్రిష్ణ, త్యాగరాజరెడ్డి, సుబ్రమణ్యం, హరికుమార్, ఇ.సాయిప్రసాద్, విజయ్‌భాస్కర్‌రెడ్డి, అనిల్‌కుమార్, ఏవీ సుబ్బారెడ్డి, స్థానిక డాక్టర్లు సుధాకర్, అనిల్‌కుమార్, సునీల్, హరిగోపాల్, శ్రీహరి, నవీన్, మునిబాలక్రిష్ణ, వీరయ్య, సుబ్బారెడ్డి తదితరులు ఆయనను ఘనంగా సన్మానించారు.

అలరించిన కూచిపూడి, భరతనాట్యం



ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమం

ఒంటిమిట్ట, ఆగస్టు 25: మండల కేంద్రంలోని స్థానిక హరిత హోటల్‌లో కూచిపూడి, భరతనాట్యాన్ని పెద్దఎత్తున చిన్నారులతో కలిసి ఆదివారం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్దఎత్తున కళాకారులు హాజరై వివిధ రకాల నృత్యాలను, వేషాలు వేసి చూపరులను ఆకర్శించారు. ముఖ్యఅతిథులుగా రాష్ట్రపతి అవార్డు గ్రహీత వేదాంతం రాజేశం, కోకన్వీనర్లు సుమన్, శ్రావణ్‌కుమార్, కళాకారులకు మెళకువలు నేర్పించారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలకు నిలువుటద్దంగా కూచిపూడి, భరతనాట్యం కనపడుతుందని, నేటి భావితరాల పౌరులకు భరతనాట్య ఆవశ్యకతను వివరించాలని వక్తలు అభిప్రాయపడ్డారు.

వైభవంగా గంగమ్మ జాతర



భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

పెనగలూరు, ఆగస్టు 25: మండలంలోని తిరణంపల్లె గ్రామంలో ఆదివారం గ్రామదేవత గంగమ్మ జాతర వైభవంగా జరిగింది. గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు జాతర కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. గ్రామంలోని ప్రతి ఇళ్లు బంధుమిత్రులు, అతిథులతో కళకళలాడింది. టీడీపీ నాయకుడు చంద్రశేఖర్‌యాదవ్, వెంకటేశ్‌యాదవ్, ఇంద్రారెడ్డిల ఆహ్వానం మేరకు ముక్కా వరలక్ష్మీ జాతరలో పాల్గొని గంగమ్మను దర్శించుకున్నారు. ఈమె వెంట డీసీసీబీ మాజీ డైరెక్టర్ లేబాక శ్రీనివాసులరెడ్డి, కొప్పోలు భాస్కర్‌రెడ్డి, బత్తిన వేణుగోపాల్‌రెడ్డి, టీడీపీ బీసీ సెల్ మాజీ అధ్యక్షుడు వెంకటయ్య, ముదిరాజ్, గట్టువారిపల్లె రాజశేఖర్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, మద్దెల వెంకటసుబ్బయ్య, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ స్వాధీనం: ఎస్ఐ

సుండుపల్లి, ఆగస్టు 25: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. గత కొద్ది రోజులుగా ఇతర మండలాల నుంచి వచ్చి ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం ఉందని, ఈ మేరకు ఆదివారం నిఘా ఉంచి పట్టుకున్నామన్నారు. ఇసుక అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తిసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

హిందువులందరూ ఐక్యంగా ఉండాలి

రాజంపేట, ఆగస్టు 25: హిందూ సమాజం కలిసికట్టుగా ఉన్నప్పుడే సుస్థిరత సాధిస్తుందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర నాయకుడు కాకర్ల రాముడు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని సరస్వతి విద్యామందిరంలో ఏర్పాటు చేసిన వీహెచ్‌పీ షష్టి పూర్తి కార్యక్రమంలో ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందువులు ఐకమత్యంగా ఉంటూ తమ ధర్మాన్ని కాపాడుకోవాలని కోరారు. పలు దేశాల్లో హిందూమతాన్ని ఇప్పటికే నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశంలో అలా కాకుండా జాతిని కాపాడే బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతి హిందువు ఐక్యంగా ఉండడానికి తమ విశ్వాసాలను జాతి ఉద్బోధించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు శ్రీనివాసులునాయుడు, సుధాకర్‌బాబు, మణి, నరసింహులు, వేణుగోపాల్‌నాయుడు, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలకు కేరాఫ్.. మానవతా సంస్థ

రాయచోటిటౌన్, ఆగస్టు 25: దాతల సహకారంతో సేవా కార్యక్రమాలకు కేరాఫ్‌గా మానవతా సంస్థ నిలుస్తోందని డిప్యూటీ తహసీల్దార్ వంశీరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రతిభా జూనియర్ కళాశాలలో మానవతా అధ్యక్షుడు ఖాదర్‌బాషా, సెక్రటరీ అంకం జయచంద్రారెడ్డి, చైర్మన్ శివగంగిరెడ్డిల అధ్యక్షతన నెలవారి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా సంస్థ అందిస్తున్న సేవలు ఎంతో మందికి ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త కేవీ రమణ, మానవతా గౌరవ సలహాదారులు వెంకట్రమణ, కేంద్ర కమిటీ డైరెక్టర్ సహదేవరెడ్డి, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి, వెంకట్రామిరెడ్డి, గంగాధర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మృతిచెందిన ఎద్దుకు అంత్యక్రియలు



అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్,ఆగస్టు 25: పట్టణంలోని మదనపల్లె రోడ్డులో గత పది రోజులుగా అనారోగ్యం బారిన పడి శనివారం రాత్రి మృతిచెందిన ఎద్దుకు ఆదివారం మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున, గోపాలమిత్ర ఓబయ్యల ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. దేశమంతా గోకులాష్టమి నిర్వహించుకుంటున్న వేళ శ్రావణమాసంలో మానవత్వంతో ముందుకు వచ్చి మృతి చెందిన ఎద్దుకు హిందూ సనాతన ధర్మం ప్రకారం అంతిమ సంస్కారం నిర్వహించడం పట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమానికి సుబ్బారెడ్డి, భూపతియాదవ్, రఫీ, పీవీ రెడ్డి, విజయరెడ్డి, రాంమోహన్‌రెడ్డిలు పూలమాలలు, మేళతాళాలతో ఘనంగా అంత్యక్రియలు నిర్వహించారు.

లయన్స్ డిస్ట్రిక్ గవర్నర్‌కు ఘన సన్మానం

రాజంపేట, ఆగస్టు 25: లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ ఎం.గౌతమ్‌ను ఆదివారం రాజంపేట వాసులు ఘనంగా సన్మానించారు. నెల్లూరులో జరిగిన ఈ సమావేశంలో అంతర్జాతీయ లయన్ డైరెక్టర్ గోపాల రామకృష్ణ క్యాబినెట్ మొత్తానికి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ వీరి నాయకత్వంలో రాబోవు రోజుల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు, విజన్ చైర్మన్ గీతాంజలి రమణ, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నరసింహరాజు, జోన్ చైర్మన్ వై.సుబ్రమణ్యంరాజు, లయన్స్‌క్లబ్ సీనియర్ నాయకులు నాగేశ్వరరావు, అబ్దుల్లా, క్లబ్ కోశాధికారి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్‌పై విమర్శలు తగవు : తాతంశెట్టి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రైల్వేకోడూరు(రూరల్), ఆగస్టు 25: సొంత ఊరికి బ్రిడ్జి, వీధిలైట్లు వేసుకోలేని మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసులు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌పై విమర్శలు చేయడం హస్యాస్పదంగా ఉందని జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీల స్వర్ణయుగానికి నాంది పలికిన ఉపముఖ్యమంత్రి పర్యటన కనీవిని ఎరుగని రీతిలో విజయవంతం కావడంతో మతిభ్రమించి విమర్శలు చేయడం సిగ్గుచేటని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమీ నాయకులు బొక్కసం చలపతి, జోగినేని మణి, పగడాల వెంకటేష్, చంద్రశేఖర్, గిద్దలూరు భాను, రాజనాల చంద్ర తదితరులు పాల్గొన్నారు.

9 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

● రూ.47 వేలు స్వాధీనం



పట్టుబడిన నిందితులతో ఎస్ఐ, సిబ్బంది

ఒంటిమిట్ట, ఆగస్టు 25: మండలంలో పేకాట ఆడుతున్న పేకాట స్థావరాలపై ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం దాడులు నిర్వహించారు. కుడమలూరు గ్రామంలో పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లామని, ఒకే గ్రామంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో పేకాట ఆడుతుండగా తమకు వచ్చిన సమాచారంతో దాడి చేసినట్లు తెలిపారు. వారి వద్ద రూ.47 వేల నగదును, 9 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు కడప సమీప ప్రాంతాలకు చెందిన వ్యక్తులు సోమశిల వెనుకజలాల్లో పేకాట ఆడుతున్నారని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడం చట్టరీత్యా నేరమని, వారిపై కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు.

బీజేపీ దళితమోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా రమణయ్య

రాజంపేట, ఆగస్టు 25: రాజంపేట బీజేపీ కార్యాలయంలో పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ అధ్యక్షతన బీజేపీ రాష్ట్ర దళితమోర్చ సభ్యుడు మోగరాజు రమణయ్యను ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సాయిలోకేష్ మాట్లాడుతూ రమణయ్య స్థాపించిన జాతీయ దళిత పార్టీని ఎన్నికల ముందు బీజేపీలో కలపడంతో ఆయన పార్టీకి చేసిన సేవలపై రాష్ట్ర అధ్యక్షురాలు పురంధరేశ్వరి అభినందించారు. రమణయ్యను రాష్ట్ర దళితమోర్చ కార్యవర్గ సభ్యునిగా నియమించారు. అనంతరం రమణయ్య మాట్లాడుతూ ఈ పదవి రావడానికి కృషి చేసిన సాయిలోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్‌లకు, పోతుగుంట రమేష్‌నాయుడుకు, నాగోతు రమేష్‌నాయుడులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడూరు నియోజకవర్గ ఇన్‌చార్జి చెంగల్‌రాజు, జిల్లా మహిళా మోర్చ అధ్యక్షురాలు సునీత, సీనియర్ నాయకులు హిమగిరి, తోట రామయ్య, షబ్బీర్‌అహ్మద్, ఆదినారాయణ, న్యాయవాది జల్లి నారాయణ, పీపీ రామ్మూర్తి, విశ్రాంత ఏఎస్ఐ రమణయ్య, ఫారెస్ట్ రేంజర్ పాపయ్య, రామ్మూర్తి, విశ్రాంత బ్యాంకు మేనేజర్ భాస్కర్ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే మహిళల ఆర్థిక వృద్ధి



మహిళా సంఘాలకు చెక్కును అందజేస్తున్న దృశ్యం

నందలూరు, ఆగస్టు 25: సీఎం చంద్రబాబుతోనే మహిళల ఆర్థిక స్వాలంబన సాధించడం జరుగుతుందని మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ అన్నారు. ఆదివారం వెలుగు కార్యాలయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన లక్‌పతి దీదీ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సంకల్పంతో సీఎం చంద్రబాబు డ్వాక్రా మహిళా సంఘాలకు శ్రీకారం చుట్టారని, నేడు ఆ మహిళా సంఘాలన్ని లక్షలాది రూపాయల రుణాలు తీసుకుంటూ ఆర్థికంగా వివిధ రూపాల్లో అభివృద్ధి చెందుతున్నారన్నారు. అనంతరం 14 మహిళా సంఘాలకు రూ.కోటి ఆరు లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీవో వసుంధర, జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి సయ్యద్ అమీర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

22 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, ఆగస్టు 25: రాయచోటి మండల పరిధిలోని చెన్నముక్కపల్లె గ్రామంలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 22 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంతో పాటు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 40 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, అర్హులైన 22 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్త, కోశాధికారి శివప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి, కంటి వైద్యులు సురేశ్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నాగారపమ్మ తల్లికి బోనాలు



ప్రత్యేక అలంకరణలో నాగారపమ్మతల్లి

సుండుపల్లి,ఆగస్టు 25: మండలంలోని పెద్దినేని కాలువ గ్రామ పంచాయతీ ఈడిగపల్లి సమీపంలో వెలసిన నాగారపమ్మతల్లి ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ అర్చకులు ఆలయాన్ని అలంకరించి, అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. మండలంతో పాటు రాయచోటి, పీలేరు, రాజంపేట తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించి, బోనాలు సమర్పించారు. మొక్కుబడులు ఉన్న భక్తులు తలనీలాలను సమర్పించి, టెంకాయలు కొట్టి మొక్కుబడి తీర్చుకున్నారు. ఆలయ సమీపంలో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో మాట్లాడుతున్న రామజగదీష్

సుండుపల్లి, ఆగస్టు 25: మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించినట్లు ఆ పార్టీ రాజంపేట అసెంబ్లీ కన్వీనర్ రామజగదీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కష్టపడి పని చేసి మండలానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగరాజు, ప్రధాన కార్యదర్శి వెంకట్రమణ నాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాచరాయడు, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు జలాభిషేకం

సిద్దవటం, ఆగస్టు 25: మండల కేంద్రమైన సిద్దవటం గ్రామ పంచాయతీలో వెలసిన గ్రామదేవత గంగమ్మ అమ్మవారికి ఆదివారం జనసేన నాయకుడు అతికారి దినేశ్ 101 బిందెలతో జలాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి పసుపు, కుంకుమతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో వర్షాలు పడాలని, రైతులందరూ సంతోషంగా ఉండాలని కోరారు. అలాగే సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ నిత్యం ప్రజల కోసమే పని చేస్తున్నారని, గ్రామాలు అభివృద్ధి చెందే విధంగా రాష్ట్రంలో ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామసభలు జరగడం అభివృద్ధికి తొలిమెట్టు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ప్రతినిధి ఓబులయ్య, నాగరాజ, ఆకులవీధి రైతులు ఆవుల సుధ, నాగేంద్ర, ఆవుల రాజా, పసుపులేటి కల్యాణ్, కొట్టే రాజేష్, మహబూబ్‌బాషా (బాబి), అక్కిశెట్టి నాగరాజా తదితరులు పాల్గొన్నారు.

బైకు-బస్సు ఢీ : ఇరువురికి గాయాలు



రోడ్డు ప్రమాదం జరిగిన ప్రాంతంలో క్షతగాత్రులు

సిద్దవటం, ఆగస్టు 25: మండలంలోని ఫారెస్ట్ చెక్‌పోస్టు సమీపంలోని అటవీ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం బద్వేల్ నుంచి కడపకు వస్తున్న ఆర్టీసీ బస్సును, భాకరాపేట బెటాలియన్ నుంచి బద్వేల్‌టౌన్‌కు బైకులో వస్తూ ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొన్నారు. దీంతో బైకుపై వెళ్తున్న శ్రీనివాసులు, గోపయ్యలకు గాయాలయ్యాయి. శ్రీనివాసులు కాలికి బలమైన గాయం కావడంతో అక్కడే పడిపోయాడు. గోపయ్యకు ఒంటికి గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని స్థానికులు చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

5 ట్రాక్టర్లు, ఎక్సకవేటర్ సీజ్



పోలీసు స్టేషన్‌లో సీజ్ చేసిన వాహనాలు

రాయచోటిటౌన్, ఆగస్టు 25: పట్టణ శివార్లలోని చిత్తూరు రోడ్డులో గల నారాయణరెడ్డిగారిపల్లె కొండావాండ్లపల్లెకు సమీపంలోని చెరువులో మట్టిని అక్రమంగా తరలిస్తుండగా రాయచోటి అర్బన్ పోలీసులు మెరుపుదాడులు చేశారు. ఇందులో భాగంగా 5 ట్రాక్టర్లు, ఒక జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. చెరువులో మట్టిని అక్రమంగా తరలిస్తుండగా సమాచారం మేరకు దాడులు చేసి అక్రమార్కులపై కేసు నమోదు చేయడంతో పాటు వాహనాలను సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

అపుస్మా నూతన అధ్యక్షుడిగా కుమార్ ఎన్నిక

రైల్వేకోడూరు(రూరల్), ఆగస్టు 25: రాష్ట్ర అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షుడుగా సిల్వర్ బెల్స్ కరస్పాండెంట్ ఎం.వి.కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని ప్రైవేటు స్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గౌరవ అధ్యక్షుడిగా పంజం సుకుమార్‌రెడ్డి, కార్యదర్శిగా కె.చంగల్‌రాజు, కోశాధికారిగా ఏ.గోపినాథ్, ఉపాధ్యక్షులుగా చిట్వేలి మండలానికి చెందిన ఎన్.సుదర్శన్‌రెడ్డి, పుల్లంపేట మండలానికి బాలాజీ, పెనగలూరు మండలానికి చెందిన ఆర్.రవి శంకర్, ఓబులవారిపల్లికు చెందిన సత్యకుమార్‌ను ఎనుకున్నట్లు తెలిపారు. అడిషనల్ జనరల్ సెక్రటరీగా టి.ప్రదీప్, తులసీ, రెడ్డయ్య, లీగల్ అడ్వైజర్‌గా మల్లికార్జున నాయుడు, కమిటీ సభ్యులుగా నరసింహారెడ్డి, రాజశేఖర్, నరేష్, నరేంద్ర తదితరులు ఎన్నికయ్యారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

● ఎంపీడీఓ గురుప్రసాదు

లక్కిరెడ్డిపల్లె, ఆగస్టు 25: స్వయం సహాయక సంఘాల మహిళల ఆర్థికాభివృద్ధే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని ఇన్ చార్జ్ ఎంపీడీఓ గురు ప్రసాదు పేర్కొన్నారు. ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ మహారాష్ట్రలో వర్చువల్ పద్ధతిలో లక్‌పతి దీదీని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు స్వయం సహాయక సంఘాల మహిళలకు ఏర్పాటు చేసిన సమావేశంలో గురుప్రసాదు మాట్లాడుతూ ప్రతి మహిళ ఆర్థికంగా, సామాజికంగా ఎదగాలన్న లక్ష్యంతో ప్రధాని మోదీ, సీఎం చంద్రాబాబు నాయుడు ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని, రూ.లక్ష నుంచి రూ.10 లక్షలు బ్యాంక్‌ల ద్వారా రుణాలు అందిస్తోందన్నారు. ఏపీఎం నిరంజన్ మాట్లాడుతూ 700 సంఘాల మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు టైలరింగ్, పాడిపరిశ్రమ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం సీఆర్‌పీలకు రూ.2కోట్ల 16 లక్షల మెగా చెక్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌పీ రాజశేఖర్, మండల సమైఖ్య సభ్యురాలు, సర్పంచు అహల్య, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యకు పరిష్కారం

పెనగలూరు, ఆగస్టు 25: పెనగలూరు ఎస్ఐ బి.రవిప్రకాష్‌రెడ్డి చొరవతో పెనగలూరు మండలం ఆటో యూనియన్ కార్మికుల సమస్య పరిష్కారమైంది. ఆటో యూనియన్ కార్మికుల ఆహ్వానం మేరకు ఆదివారం ఆయన బెస్తపల్లెలో సమస్యగా ఏర్పడిన ఆటో స్టాండ్ పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆటో కార్మికులు, స్థానిక దుకాణదారులతో చర్చలు జరిపారు. ఇరువురికి ఆమోదయోగ్యంగా ఉండేవిధంగా ఆటోలు నిలుపుకునే స్థలంలో ఆటోస్టాండు అని మార్కింగ్ వేయించి సమస్యను పరిష్కరించారు. అనంతరం ఆటో కార్మికులతో మాట్లాడుతూ ప్రతి ఆటో కార్మికుడు డ్రెస్‌కోడ్ తప్పనిసరిగా పాటించాలని, తాగి వాహనాలు నడపవద్దని, డ్రైవర్‌కు లైసెన్సు తప్పనిసరి అన్నారు. ప్రస్తుత ప్రభుత్వ నిబంధనల ప్రకారం అపరాధ రుసుం విధిస్తే భారీగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎం.గంగాధర్ ఎస్ఐకి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎస్ఐని శాలువాతో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు వై.చలపతి, ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు, ఆటో యూనియన్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



ఎస్వీ గెస్ట్‌హౌస్ వద్ద స్లాటెడ్ టోకెన్ల భక్తులు

తిరుమలలో పెరిగిన భక్తుల రద్దీ

శ్రీవారి సర్వదర్శనానికి 20 గంటలు

తిరుమల, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. శని, ఆదివారాలతోపాటు సోమవారం గోకులాష్టమి వంటి వరుస సెలవుల నేపథ్యంలో శనివారం రాత్రి నుంచే కొండకు వచ్చే భక్తుల రద్దీ పెరిగింది. శ్రీవారి మాడవీధులు, అఖిలాండం, లడ్డూ వితరణ కేంద్రం, అన్నప్రసాద భవనం, బస్టాండ్ వంటి ప్రాంతాలు భక్తులతో కిక్కిరిశాయి. సర్వదర్శనం భక్తులతో వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరి షెడ్లు నిండి క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి 20 గంటల దర్శన సమయం పడుతోంది. అలాగే గదుల కోసం భక్తులు సీఆర్వో వద్ద క్యూలో బారులు తీరారు. సిఫార్సుల లేఖలపై గదులు ఇచ్చే పద్మావతి, ఎంబీసీ24, టీబీ కౌంటర్లు కూడా కిటకిటలాడాయి. మరోవైపు తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలు కూడా రద్దీగా దర్శనమిస్తున్నాయి. స్లాటెడ్ టోకెన్లు, టికెట్లు కలిగిన భక్తులతో ఎస్వీ గెస్ట్‌హౌస్ ప్రాంతం సందడిగా మారింది. ఇచ్చిన సమయానికంటే ముందుగానే వచ్చిన భక్తులు ఫుట్‌పాత్‌లపై సేదతీరుతూ కనిపించారు.



కృష్ణతేజ సర్కిల్ వద్ద సర్వదర్శన క్యూలైన్



ఎస్వీ గెస్ట్‌హౌస్ వద్ద ఫుట్‌పాత్‌పై సేదతీరుతున్న యాత్రికులు

బియ్యం లారీ పట్టివేత



పట్టుబడిన బియ్యం లారీ

పలమనేరు, ఆగస్టు 25: అరగొండ నుంచి కర్ణాటక రాష్ట్రం బంగారుపేటకు తరలిస్తున్న చౌక బియ్యం లారీని పలమనేరులో పట్టుకొన్నారు. స్పెషల్ బ్రాంచ్ హెడ్‌కానిస్టేబుల్ తోట శ్రీనివాసులు ఇచ్చిన సమాచారం మేరకు ఆదివారం తెల్లవారుజామున లారీని పట్టుకున్నారు. లారీలో 10 టన్నుల బియ్యం ఉంది. డ్రైవర్, క్లీనర్లను అరెస్టు చేశారు. పలమనేరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు, రేపు శ్రీలంక రైతుల పర్యటన

కుప్పం, ఆగస్టు 25: కుప్పం నియోజకవర్గంలో సోమ, మంగళవారాల్లో రెండురోజుల పాటు శ్రీలంక రైతుల బృందం పర్యటిస్తుందని జిల్లా ప్రాజెక్ట్ మేనేజరు వాసు తెలిపారు. శ్రీలంక దేశానికి చెందిన అమృత భూమి ప్రాజెక్ట్ నుంచి 20 మంది రైతుల బృందం నియోజకవర్గంలోని ప్రకతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శిస్తుందని వివరించారు. ఇక్కడ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో విస్తృతంగా, సమర్థంగా, ప్రకృతి వ్యవసాయ సార్వత్రిక సూత్రాలకు అనుగుణంగా అమలు జరుగుతున్న ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులను ఆ బృందం పరిశీలించనున్నట్లు తెలిపారు.

ప్రతి సంఘం సభ్యురాలూ లక్షాధిపతి కావాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మహిళా సంఘ సభ్యులు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 25: స్వయం సహాయక సంఘాల్లోని ప్రతి మహిళా సభ్యురాలు లక్షాధిపతి కావాలన్నదే ప్రభుత్వ ఆశయమని ప్రధాని మోదీ అన్నారు. ఆదివారం మహారాష్ట్ర జలగాన్ నుంచి స్వయం సహాయక సంఘ సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. పీఎం ప్రసంగ వీక్షణకు కలెక్టరేట్ డీఆర్‌డీఏ పీడీ తులసి, ఎల్‌డీఎం హరీష్ పాల్గొనగా, మండల, గ్రామీణ స్థాయిలో ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. మహిళలు ఆర్థికంగా బలపడటమే ప్రధాన సంకల్పమన్నారు. అనంతరం స్త్రీనిధి, ఉన్నత తదితర రుణాల కింద 5,738 మంది సభ్యులకు రూ.117.30 కోట్ల చెక్ అందజేశారు. డీపీఎం రవి, ఏపీఎంలు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

చెల్దిగానిపల్లెలో దొంగల స్వైరవిహారం

- భారీగా వెండి, బంగారం చోరీ

రామకుప్పం, ఆగస్టు 25: రామకుప్పం మండలం చెల్దిగానిపల్లెలో శనివారం రాత్రి దొంగలు స్వైరవిహారం చేశారు. తాళాలు వేసిన ఇంటి తలుపులు బద్దల గొట్టి భారీగా వెండి, బంగారం తీసుకెళ్లారు. బాధితులు తెలిపిన ప్రకారం.. దేవేంద్ర, ఆయన భార్య గ్రామంలో వ్యవసాయం చేస్తూ.. జాతీయ రహదారి పక్కన తమ ఇంట్లో నివసిస్తున్నారు. శనివారం సాయంత్రం వారు బెంగళూరులో ఉద్యోగాలు చేస్తున్న కుమార్తె, కుమారుడు వద్దకు వెళ్లారు. ఆదివారం సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చారు. ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో అనుమానించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తలుపులు తెరచి ఉన్నాయి. వస్తువులు చిందరవందరగా పడున్నాయి. బీరువాలో 1.30కిలోల వెండి, 82గ్రాముల బంగారం, రూ.20వేలు నగదు దుండగులు తీసుకెళ్లినట్లు గుర్తించారు. ఈ మేరకు దేవేంద్ర పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



దుండగులు పగులగొట్టిన తలుపు, బీరువా

తెలుగు భాష వైభవానికి మరిన్ని సంస్కరణలు రావాలి

- తెలుగు వెలుగు సాహితీ సమావేశంలో గోరటి వెంకన్న ఆకాంక్ష

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 25: తెలుగు భాష వైభవానికి ప్రభుత్వం మరిన్ని సంస్కరణలు తీసుకు రావాలని ప్రముఖ గేయ రచయిత, తెలంగాణ రాష్ట్ర ఎమ్మెల్సీ గోరటి వెంకన్న ఆకాంక్షించారు. చిత్తూరులో ఆదివారం భారతీయ తెలుగు రచయితల సంఘం, ఎంవీ కేశవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన తెలుగు వెలుగు సాహితి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి భాషకు ఒక సంస్కృతి ఉంటుందని, ఆ సంస్కృతులు అంతరిస్తేనే భాషలు అంతరిస్తాయన్నారు. తెలుగు సంస్కృతి చాలా చరిత్ర కలదని, దేశభాషలందు తెలుగుభాష లెస్స అన్న రాయలు, తెలుగు పద వైభవాన్ని, ఆధ్యాత్మికతను జోడించి విశేష ప్రచారం చేసిన మహనీయులు అన్నమయ్య, త్యాగయ్య, వేమన, బ్రహ్మంగారు, శ్రీశ్రీ ఆద్యులన్నారు. సమాజ చైతన్యానికి రచయితలు చేసే సేవలు అనంతమన్నారు. సాహితీరంగం పట్ల కేంద్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తుండటాన్ని సాహితీవేత్తలంతా ఖండించాలని సినీ మాటల రచయిత చిన్నికృష్ణ పిలుపునిచ్చారు. కేంద్ర సాహితీ అవార్డుల పేరుతో సాహితివేత్తలకు రూ.కోటి, 1000 చదరపు అడుగుల ఇంటి స్థలం, ప్రజాప్రతినిధులకు ప్రభుత్వం ఇచ్చే సౌకర్యాలను కల్పించాలని డిమాండు చేశారు. తాను తెలుగు మూలాలున్న వ్యక్తినని, తన వ్యాపారాల్లో తెలుగు వారికే అవకాశాలు కల్పిస్తున్నట్లు మాజీ రాష్ట్రపతులు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్, వి.వి.గిరిల మనవడు డాక్టర్ సుబ్రమణ్యం శర్మ పేర్కొన్నారు. ఆయన ప్రసంగిస్తుండగా గోరటి వెంకన్న, చిన్నికృష్ణ పాదాభివందనం చేయడంతో సభికులు చప్పట్లతో అభినందించారు. అనంతరం కార్యక్రమ నిర్వాహకులు నారాయణస్వామి, ఓం శ్రీధర్‌రెడ్డి అతిథులను సత్కరించారు. సీపీ బ్రౌన్‌సంస్థ నిర్వాహకులు లక్ష్మిరెడ్డి, మణ్రిపూడి దేవేంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న గోరటి వెంకన్న

మిలటరీస్కూల్స్ ప్రవేశపరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), ఆగస్టు 25: జాతీయస్థాయిలో 2025-26 విద్యాసంవత్సరానికి రాష్ట్రీయ మిలటరీస్కూల్స్‌లో 6, 9 తరగతుల్లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశపరీక్షకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారని కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం పోటీపరీక్షల ఉచిత సమాచార కేంద్రం అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఈపరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు వయసు ఆధారంగా 5 నుంచి 9 తరగతులు చదివే బాల, బాలికలకు అవకాశం ఉందని, వచ్చేనెల 19వ తేదీతో దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. ప్రవేశపరీక్షా విధానం, దరఖాస్తు వంటి ఇతర వివరాలకోసం తిరుపతిలో వరదరాజనగర్‌లోని విశ్వంస్కూల్‌లోగానీ లేదా 86888 88802/ 93999 76999 ఫోన్ నెంబర్లని సంప్రదించాలని కోరారు. కాగా జాతీయస్థాయిలో నిర్వహించే పలు పోటీపరీక్షలకు దరఖాస్తు గడువుతేదీ, విద్యార్హత వంటి వివరాలు ఈవిధంగా ఉన్నాయి.

కోర్సు	ప్రవేశం	దరఖాస్తుకు చివరితేదీ
నవోదయ	6వతరగతి	16-09-2024
ఆర్ఐఎంసీ	8వతరగతి	30-09-2024
మిలటరీస్కూల్స్	6 నుంచి 9తరగతులు	19-09-2024



తిరుచానూరు ఆలయం వద్ద మాక్‌డ్రిల్ చేస్తున్న ఆక్టోపస్ బృందాలు

అమ్మవారి ఆలయం వద్ద ఆక్టోపస్ మాక్‌డ్రిల్



తిరుచానూరు, ఆగస్టు 25: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో ఆదివారం తెల్లవారుజామును టీటీడీ విజిలెన్స్ సిబ్బంది, ఆక్టోపస్ దళం మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఉగ్రవాదులు చొరబడినపుడు ఏదైనా అత్యవసర పరిస్థితులు వాటిల్లినపుడు ఎలా ఎదుర్కోవాలి.. భక్తులను ఎలా రక్షించాలి అనే విషయాలను మాక్‌డ్రిల్ ద్వారా చేసి చూపించారు. ఆక్టోపస్ దళాలు రాష్ట్రంలోని ప్రముఖ స్థలాలు, ఆలయాలు, ప్రభుత్వ రంగ సంస్థల్లో ఏటా మాక్ డ్రిల్ నిర్వహించడం జరుగుతోంది. ఈ కార్యక్రమంలో వీజీవో నందకిషోర్, ఏవీఎస్వో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పులిబోనుపల్లె వద్ద ఏనుగు మృతి



ఏనుగు కళేబరం

ఎర్రావారిపాలెం, ఆగస్టు 25: తలకోన అటవీ సరిహద్దు గ్రామం ఎర్రావారిపాలెం మండలంలోని పులిబోనుపల్లె వద్ద ఓ ఏనుగు మృతి చెందింది. సుమారు ఆరేళ్ల వయసున్న ఈ గజరాజు నాలుగు రోజుల కిందట చనిపోయినట్లు అటవీ అధికారులు ఆదివారం ఉదయం ఆలస్యంగా గుర్తించారు. తలకోన అటవీ ప్రాంతంలో వన్య ప్రాణుల వేట జోరుగా సాగుతోంది. 11 కేవీ లైను నుంచి కరెంటు తీసి, కొందరు వేటాడడం జరుగుతుంది. అయితే ఏనుగు అనారోగ్యంతో మరణించిందా లేక విద్యుతాఘాతమా అన్నది పోస్టుమార్టం నివేదిక వచ్చాక తెలియనుంది. ఈ ప్రాంతంలో ఇది రెండో సంఘటన. గతంలో నాటు బాంబు నమిలి గున్నఏనుగు మృతి చెందింది.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 'గజ' మరణ ఘోష

◆ 14 ఏళ్లలో 46 మృతి

ఎర్రావారిపాలెం, ఆగస్టు 25: ఉమ్మడి చిత్తూరు జిల్లా అడవుల్లో వన్యప్రాణులకు రక్షణ కరువైతున్నది. 14 ఏళ్లలో 46 ఏనుగు మృత్యువాత పడ్డాయి. కారణాలు ఏవైనా అరుదైన ఏనుగులు మృతి చెందడం జరుగుతూనే ఉండడంతో వన్యప్రాణి ప్రియులు ఆవేదన చెందుతున్నారు.

సంవత్సరాల వారీగా మరణాలు

- 2010లో ఎర్రావారిపాలెం చింతగుంట గ్రామం కృష్ణయ్య పొలంలో కరెంట్ షాక్‌తో ఒక ఏనుగు మృతి.
- 2011లో దేవరకొండ గ్రామం తిమ్మారెడ్డి మామిడితోపులో బావిలోపడి గర్భంతో ఉన్న ఆడ ఏనుగు మృతి.
- 2012లో సిద్దలగండి ప్రాజెక్టులో నీటి కోసం వెళ్లిన గున్నఏనుగు ఊబిలో దిగబడి మృతి.
- 2013లో కరెంట్ షాక్‌తో ఓ ఏనుగు మృతి. కుప్పంలో విద్యుత్ షాక్‌తో మూడు గజరాజులు మృత్యువాత పడ్డాయి.
- 2014 కౌండిన్య అభయారణ్యంలో అనారోగ్యంతో ఓ ఏనుగు మృతి.
- 2015లో పులిబోనుపల్లె వద్ద నాటుబాంబు నమిలి ఏనుగు దుర్మరణం. రామకుప్పం అడవిలో ఒకటి, ఎర్రావారిపాలెం సుబ్బరామాపురం వద్ద కరెంట్ షాక్‌తో మరో ఏనుగు మృతి.
- 2017లో ఎర్రావారిపాలెం కోటకాడ పల్లె వద్ద విద్యుత్ షాక్‌తో ఏనుగు మృత్యువాత.
- 2018 రామకుప్పం శెట్టిపాలెం పొలాల్లో విద్యుత్ షాక్‌తో ఏనుగు మరణం.
- 2019లో ననియాల అడవులోని చెత్తపెంట వద్ద ఒకటి, పలమనేరు గొబ్బిళ్లకూరు వద్ద ట్రాన్స్‌ఫార్మర్ తగిలి మరో ఏనుగు మృతి. ఇదే ఏడాది ననియాల అడవులో ఆడ ఏనుగును మదపుటేనుగు గుద్ది చంపింది. కుప్పం ప్రాంతంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు తగిలి ఒకటి మృతి. ఇదే ఏడాదిలోనే తమిళనాడు-ఆంధ్ర సరిహద్దులో రైల్వే ట్రాక్‌పై ఎనిమిది గజరాజుల మృతి. కోటకాడపల్లె వద్ద అనారోగ్యంతో ఒకటి, ఐరాల వద్ద రెండు ఏనుగులు కరెంట్ షాక్‌తో మృతి చెందగా.. రైతు గోతితీసి పూడ్చివేశారు. బంగారుపాళ్యం మండలం మొగిలివారిపల్లె వద్ద పొలంలో విద్యుత్ షాక్‌తో ఓ ఏనుగు మృతి.
- 2020లో చిత్తూరు సమీపంలోని గంగవరం వద్ద విద్యుత్ షాక్‌తో ఏనుగు మరణం.
- 2021లో పలమనేరు కోతిగుట్ట వద్ద ట్రాన్స్‌ఫారం ఢీకొని ఏనుగు మరణం, ఇదే మండలంలో విద్యుత్ షాక్‌తో ఒంటరి ఏనుగు మృతి. బంగారుపాలెం రాగిమానుపెంట వద్ద, సోమల మండలంలో విద్యుత్ వైర్లు నమలడంతో రెండు మృతి. కార్వేటినగరం మండలంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో ఓ ఏనుగు మృతి.
- 2022లో సదుం చెరుకువారిపల్లె వద్ద విద్యుత్ షాక్‌తో ఒకటి. మొగిలి ఘాట్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ తగిలి ఒకటి, బంగారుపాళ్యం మండలం చిట్టేరి మామిడితోపులో విద్యుత్ షాక్‌తో ఒకటి. టేకు మంద వద్ద స్తంభాన్ని ఢీకొనడంతో తీగలు తెగిపడి ఒకటి. మొగిలిపెంట వద్ద మామిడి చెట్టు విరిచే క్రమంలో విద్యుత్ తీగలు తగిలి ఒకటి. టేకుమంద కొణతలముడుగు సమీపంలో పూలవానికుంట వంక వద్ద మామిడితోటలో విద్యుత్ తీగలు నమలడంతో గర్భంతో ఉన్న ఏనుగు మృతి.
- 2023లో మొగిలి ఘాట్ వద్ద మినీలారీ ఢీకొని మూడు ఏనుగులు మృతి. బైరెడ్డిపల్లె నెల్లిపల్లి పంచాయతీ నల్లగుట్టపల్లె వద్ద తమిళనాడు నుంచి వచ్చి ఆరు ఏనుగుల మంద విద్యుత్ స్తంభం గుద్దడంతో వైరు పైనబడి ఒకటి మృతి.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.87 కోట్లు

తిరుమల, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.87 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.3.87 కోట్లు ఆదాయం లభించినట్లు టీటీడీ ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 79,521 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 40,152 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

త్వరగా భక్తులకు లడ్డూలు అందజేయండి

- అధికారులను ఆదేశించిన అదనపు ఈవో

తిరుమల, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): భక్తుల రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో నిరీక్షణ సమయాన్ని తగ్గించి త్వరితగతిన లడ్డూలు అందజేయాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. తిరుమలలోని లడ్డూకాంప్లెక్స్‌లో ఆయన ఆదివారం తనిఖీలు నిర్వహించారు. భక్తులు లడ్డూలు పొందే పద్ధతులను పరిశీలించి అధికారులు పలు సూచనలు చేశారు. అంతకుముందు శ్రీవారి ఆలయ నాలుగు మాడవీధులను పరిశీలించారు. అక్టోబరు 4నుంచి బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో ఆలయ డిప్యూటీఈవో లోకనాథంతో కలిసి భక్తులు గ్యాలరీల్లో ప్రవేశించే, బయటకు వచ్చే మార్గాలను స్వయంగా చూశారు. ప్రత్యేకంగా గరుడసేవ రోజు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. వీరితోపాటు వీఎస్వో సురేంద్ర, ఏవీఎస్వో మనోహర్ ఉన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా..
తిరుమలలో 8 ప్రథమ చికిత్స కేంద్రాలు

తిరుమల, ఆగస్టు25(ఆంధ్రజ్యోతి): రానున్న వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలలో ఎనిమిది ప్రథమ చికిత్స కేంద్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయనున్నారు. స్వామివారి బ్రహ్మోత్సవాలు అక్టోబరు 4 నుంచి 12వ తేదీ వరకు జరగనున్నాయి. ఈక్రమంలో భక్తులకు అసౌకర్యం లేకుండా టీటీడీ వైద్య విభాగం ఆధ్వర్యంలో నూతన చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇప్పటికే తిరుమల, తిరుపతిలో శాశ్వతంగా ఆరు డిస్పెన్సరీలు, ఆరు ప్రథమ చికిత్స కేంద్రాలలో భక్తులకు, ఉద్యోగులకు, స్థానికులకు టీటీడీ వైద్య సేవలు అందిస్తోంది. కాగా, బ్రహ్మోత్సవాల్లో భక్తుల సౌకర్యార్థం అదనంగా తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనాల్లో 2, రాంబగీచ అతిథిగృహాలు, వెంగమాంబ అన్నప్రసాద కేంద్రం, శిలాతోరణం, బాటగంగమ్మ ఆలయం, పాపవినాశనం, ఏడవమైలు వద్ద ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేయనున్నారు.

మా కార్యకర్తల జోలికొస్తే ఖబడ్దార్

- పెద్దిరెడ్డిని హెచ్చరించిన చల్లా బాబురెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చల్లా బాబురెడ్డి

కల్లూరు, ఆగస్టు 25: కూటమి పార్టీల కార్యకర్తల జోలికి వస్తే ఖబడ్దార్ అంటూ మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి (బాబురెడ్డి) హెచ్చరించారు. పులిచెర్ల మండలం కూనపల్లి సమీపంలో ఆదివారం టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. 'గత ప్రభుత్వంలో తన అరాచకాలను ఖండించిన అప్పటి వైసీపీ ఎమ్మెల్యే శ్రీనివాసులుకు చిత్తూరు ఎమ్మెల్యే టిక్కెట్టు రాకుండా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అడ్డుకున్నారు. అయితే వేంకటేశ్వరస్వామి పాదాల చెంత ఉన్న తిరుపతికి వెళ్లిన శ్రీనివాసులు జనసేనపార్టీ ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిచారు. పుంగనూరు నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వ అవినీతిపై నోరెత్తిన టీడీపీ కార్యకర్తలపై పోలీసులను అడ్డుపెట్టుకుని పెద్దిరెడ్డి అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపించారు. పెద్దిరెడ్డి అవినీతి, అరాకాలపై విసిగిపోయిన ప్రజలు ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తల జోలికొస్తే ఖబడ్దార్' అంటూ హెచ్చరించారు. జగన్మోహన్‌రెడ్డి రాక్షస పాలనలో రాష్ట్రం అంధకారంలోకి వెళ్లిందని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చల్లా రామచంద్రారెడ్డి పుంగనూరులో పోరాడి స్వల్ప ఓట్లతో ఓటమి చెందారని, వచ్చే ఎన్నికల్లో జిల్లాలోనే అత్యధిక మెజారిటీతో ఆయన గెలుస్తారన్నారు. 2019 ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇవ్వండని సీఎం అయిన జగన్మోహన్‌రెడ్డి దుర్మార్గంగా పాలించాడన్నారు. ఐదేళ్ల కాలంలో జగన్ చేసిన అరాచకాలతో ఇక ఎప్పటికీ జగన్ సీఎంకాలేడన్నారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఐదేళ్ల కాలంలో ఏపీని అవినీతి ప్రదేశ్‌గా మార్చిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పరదాల చాటున, ప్రజలకు దూరంగా తిరిగిన జగన్మోహన్‌రెడ్డి 11 సీట్లకు పరిమితమయ్యాడన్నారు. అధికార పార్టీకి కొమ్ముకాసిన అధికారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ సందర్భంగా మంగళంపేట నుంచి కొత్తపేట మీదుగా కొమ్మిరెడ్డిగారిపల్లి వరకు జనసేన పార్టీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా జనసేనపార్టీ అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్, టీడీపీ, బీజేపి, జనసేనపార్టీ నాయకులు రామనాథం నాయుడు, మురళీధర్, కుమార్‌రెడ్డి, రవినాయుడు, సుబ్బారెడ్డి, ధనంజయనాయుడు, గోపినాయుడు, చిన్నరాయల్, సామంచి శ్రీనివాసులు, నవీన్‌రాయల్, మదన్‌మోహన్, శివకుమార్, జనార్దన్, లోకేష్, రమణ, చంద్రబాబు, మునీష్, మునికృష్ణ, మునిశేఖర్, మధు తదితరులు పాల్గొన్నారు.

దిష్టి పూజను క్షుద్ర పూజలంటూ..!

కుప్పం, ఆగస్టు 25: కుప్పంలో దిష్టిపూజను క్షుద్రపూజలంటూ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారు. దీంతో స్థానికులు భయాందోళన చెందారు. ప్యాలస్ రోడ్డులో ఆంధ్రాబ్యాంకు ఎదురుగా డివైడర్ల మధ్యలో ముగ్గువేసి, ఎర్రటి గుడ్డపేలికతోపాటు కొబ్బరికాయ కొట్టి, పసుపు కుంకుమలు చల్లిఉండడం స్థానికుల కంటి పడింది. రక్తపు మరకలు కూడా ఈ ముగ్గు చుట్టుపక్కల కనిపించాయి. తెల్లవారుతూనే ఈ దృశ్యం చూసిన కొంతమంది వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. అంతే, పట్టణంలో క్షుద్ర పూజలు చేశారన్న ప్రచారం జోరందుకుంది. సాధారణంగా ఇంట్లో ఎవరికైనా ఆరోగ్యం బాగులేకుండా దీర్ఘకాలం తీసుకుంటున్నా, లేక కుటుంబ పరంగా ఏదైనా కష్టనష్టాలున్నా, ఇటువంటి పూజలు చేయడం కుప్పం ప్రాంతంలో మామూలు. కానీ సామాజిక మాధ్యమాల్లో ఉన్నవీ లేనివీ కల్పించి ప్రచారం చేయడంతో క్షుద్ర పూజలు జరిగాయన్న ప్రచారం మాత్రం విస్తృతంగా జరిగింది.

ప్రతి మహిళా లక్షాధికారి కావాలి



రామసముద్రంలో డ్వాక్రా మహిళలకు మెగా చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



ములకలచెరువలో వడ్డీలేని రుణాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేత జయచంద్రారెడ్డి

మదనపల్లె టౌన్, ఆగస్టు 25: స్వయం సహాయ సంఘంలో ఉన్న ప్రతి మహిళా లక్షాధికారి అయ్యేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్‌పత్ దీదీ కార్యక్రమాన్ని రూపొందించాయని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో మండలంలోని 15 ఎస్ఎస్‌జీ సభ్యులకు రూ.2కోట్ల రుణాల చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిరు వ్యాపారులకు ఈ పథకం ఎంతో తోడ్పాటు ఇస్తుందన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలన్నదే ప్రభుత్వాల ఉద్దేశ్యమన్నారు. కూరగాయల వ్యాపారులకు అవసరమైన స్థలాన్ని మదనపల్లె పట్టణంలో కేటాయించేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్య క్రమంలో ఏపీఎం సురేష్‌రెడ్డి, టౌన్‌బ్యాంకు మాజీ చైర్మన్ విద్యాసాగర్, ఎస్ఎస్‌జీ సభ్యులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు

ములకలచెరువు, ఆగస్టు 25: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు డ్వాక్రా మహిళలకు వడ్డీ లేకుండా రుణాలు అందిస్తున్నారని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఆదివారం జరిగిన లక్‌పతి దీదీ కార్యక్ర మంలో పాల్గొని 43 స్వయం సహాయక సంఘాల మహిళలకు రూ.5.61 కోట్లు రుణాలను అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత మంత్రి గిరిధర్‌రెడ్డి, బీజేపీ నేత గోపాల్‌రెడ్డి, మండల కన్వీనర్ జయరాంరెడ్డి, ఏపీఎం హరి, నాయకులు ప్రసాద్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారత లక్ష్యంగా ప్రభుత్వం ముందడుగు

రామసముద్రం, ఆగస్టు 25: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సార ధ్యంలో మహిళా సాదికారిత దిశగా అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన మహిళా సమాఖ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ మహిళల ఆర్థిక పరిస్థితి మెరుగు పరచడానికి రాష్ట్రంలో మెట్టమొదటి సారిగా డ్వాక్రా సంఘాలు ఏర్పాటుచేసిన ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని గుర్తు చేశారు. మహిళలను లక్షాధికారులను చేయాలనే దృఢ సంకల్పంతో అటు ప్రధానమంత్రి మోదీ, ఇటు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం లక్‌పతితి దీదీ పథకం కింద 44డ్వాక్రా గూప్రులకు రూ.5.42కోట్లు లబ్దిదారులకు ఎమ్మెల్యే మెగా చెక్కును అందించారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు, ఏపీ ఎం సుబ్రహ్మణ్యం, ప్రతీప్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, చిన్నుస్వామి, రాజేష్, కృష్ణం రాజు, శివశంకర్, బోయ రమణ, శ్రీకాంత్, శ్రీనాథ్, జయకుమార్‌శెట్టి, రమేష్, జావీద్, వాహిద్, అల్తాఫ్, హుస్సేన్, కృష్ణప్ప, బాలాజి, శివన్న, అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

పెద్దమండ్యంలో: వెలుగు సంఘాలలోని ప్రతి మహిళా ఆర్థికాభి వృద్ధి సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్దం చేయాలని ఏపీఎం మధుశేఖర్‌బాబు పిలుపు నిచ్చారు. పెద్దమండ్యం స్త్రీశక్తి భవనంలో ఆదివారం లక్‌పతి దీదీ కార్యక్రమం సందర్భంగా ఏపీఎం మాట్లాడు తూ వెలుగు పంఘంలో ఉన్న ప్రతి పభ్యురాలు లక్షాధికిరి చేయడంతో పాటు నెలకు రూ. 10 వేలు ఆదాయ వచ్చే విధంగా శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఉత్తమ సంఘమిత్రలుగా పెద్దమండ్యం రామసుబ్బయ్య, అమరావతి, అంజనమ్మ, రెడ్డప్ప సత్యలక్ష్మీ, అరుణలకు ప్రశంసా పత్రాలను అందజేశారు. అలాగే మండలంలోని 19 వెలుగు సంఘాలకు బ్యాంక్ లింకేజీ రూ.19.2 కోట్ల చెక్కును సంఘాలకు అందజేశారు. సర్పంచ్ బాబా, కూటమి నేతలు తెలుగు యువత నేత గంగాధర, జనసేన మండల అధ్యక్షుడు శంకర, ప్రకాష్‌రెడ్డి, సీసీలు సూరి, శంకరమ్మ, శ్రీనివాసులు, రమణ, రెడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: ప్రధానమంత్రి లక్‌పతి దీదీ పథకాన్ని మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. ఆదివారం స్థానిక శ్రీనిధి కార్యాలయంలో జరిగిన చెక్కుల పంపిణీకి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ప్రభుత్వం మహిళా సంఘాలకు ఎంత గానో తోడ్పాటునిస్తోందని తెలిపారు. అనంతరం 18 సంఘాల మహిళా సంఘాల మహిళలకు రూ.3కోట్ల 30లక్షల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యమంలో ఏపీఎమ్ రజినీకుమారి, ఎంపీడీవో రమేష్ అధికార ప్రతినిధి ఆర్వే వెంకటేష్ పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: డ్వాకా సంఘాల సభ్యులు ఆర్థిక వృద్ధి సాధించాలని అడ్మినిస్ట్రేటివ్ అధికారి(ఏవో) ఆనంద్‌కుమార్ సూచించారు. ప్రధాని మోదీ నిర్వహించిన లక్‌పతి దీదీస్ కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సీసీలు, సంఘమిత్రలు, మహిళా సభ్యులు వీసీలో తిలకించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలను లక్ష్యాధికారులను చేయాలనే లక్ష్యంతో ప్రధాని ఈ పథకం ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో సీసీలు, సంఘమిత్రలు, మండల సమాఖ్య అధ్యక్షురాలు రామలక్ష్మీ, టీడీపీ మాజీ మండలాధ్యక్షుడు ఉత్తమ్‌రెడ్డి, సిద్దమ్మ, తెలుగుయువత నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నరసింహులు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామచంద్ర, గుండ్లపల్లె యూనిట్ ఇన్‌చార్జి కాలానారాయణ, మూలపల్లె శేఖర, సుబ్బయ్య, సుధాకర, తదితరులు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ప్రధాని నరేంద్రమోదీ లక్‌పతి దీదీ పథకం చేపట్టారని బీజేపీ మండల అధ్యక్షుడు రామదాసు పేర్కొన్నారు. బి.కొత్తకోట పట్టణంలోని మండల మహిళాసమాఖ్య కార్యాలయంలో ఏపీ సెర్ప్ ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య సభ్యులకు ఆదివారం ఓరియెంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. మహిళా సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం నేరుగా ప్రవేశపెట్టిన పథకాలు, రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో చేపడుతున్న పథకాల గురించి సంఘమిత్రలు అవగాహన కల్పించాలని నాయకులు రామదాసు, ముకుందలు కోరారు.

కొయ్యల మిషన్‌లో అగ్నిప్రమాదం



వాల్మీకిపురం, ఆగస్టు 25: వాల్మీకిపురం పట్టణంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న కొయ్యల మిషన్‌లో ఆదివారం ఉదయం అగ్నిప్రమాదం జరిగింది. పట్టణంలోని నాయక్ వీధికి చెందిన సయ్యద్‌బాషా తిరుపతి రోడ్డులోని పెట్రోల్ బంకు ఎదురుగా కొయ్యల మిషన్ నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఉదయం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి కొయ్యల మొత్తం కాలిపోయాయి. ఈప్రమాదంలో కొయ్యల మిషన్‌తో పాటు విలువైన కొయ్యలు, ద్విచక్రవాహనం కాలిపోయాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకుని అగ్ని ప్రమాదాన్ని నివారించినా ప్రయోజనం లేకపోయింది. ప్రమాదంలో దాదాపు రూ.10లక్షలు నష్టం వాటిల్లిందని బాధితుడు సయ్యద్‌బాషా వాపోయాడు. అప్పులు చేసి కొయ్యల మిషన్ పెట్టుకున్నానని, తనను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

పాము కాటుతో మహిళ మృతి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 25: పాము కాటుకు గురై మహిళ మృతి చెందిన సంఘటన ఆదివారం మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసుల కథనం మేరకు మదనపల్లె మండలం, చీకలబైలు పంచాయతీ జమ్ములలకుంటకు చెందిన బాపనపల్లె రాజశేఖర్, కవిత(33) వ్యవసాయం పొలంలో పనికి వెళ్లారు. ప్రతి రోజూ లాగానే కవిత ఆదివారం పొలం పనులకు వెళుతుండగా దారిలో ఆమెను పాము కాటు వేసింది. సంఘటన స్థలం నుంచి వెంటనే ఆమెను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందినట్లు తెలిపారు.

ఇంటర్ విద్యార్థి అదృశ్యంపై ఫిర్యాదు

బి.కొత్తకోట, ఆగస్టు25: కాలేజికి వెళ్లిన తమ కుమారుడు తిరిగి ఇంటికి రాలేదని బి.కొత్తకోట పట్టణంలోని వాయిలవంక వీధికి చెందిన పట్నూల్ రియాసత్‌ఖాన్ ఆదివారం బి.కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇతని కుమారుడు అర్షద్‌ఖాన్ స్థానికంగా ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. శనివారం ఇంటినుంచి బయలుదేరి కాలేజికి వెళ్లాడని తిరిగి ఇంటికి చేరలేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. సీఐ రాజారెడ్డి ఆదేశాల మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ నాగరాజు తెలిపారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 25: పట్టణ సమీపంలోని అమ్మచెరువు మిట్ట వద్ద పేకాటాడుతున్న ఐదుగురు జూదరులను మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు ఆదేశాల మేరకు వన్ టౌన్ సీఐ చాంద్‌బాషా తన సిబ్బందితో వెళ్లి ఆదివారం అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారి వద్ద నుంచి రూ. 5680 నగదును స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్ తరలిస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జూదం, కర్ణాటక మద్యం, సారా విక్రయాలు, ఇతరతర అసాంఘిక కార్యక్రమాలు ఎక్కడైనా జరుగుతుంటే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వన్ టౌన్ ఎస్ అన్వర్‌బాషా. పోలీసులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మున్సిపల్ ఉద్యోగి మృతి



జయప్రకాష్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

బి.కొత్తకోట, ఆగస్టు25: బి.కొత్తకోట నగర పంచాయతీ కార్యాయంలో వాటర్‌మ్యాన్‌గా విధులు నిర్వహించే జయప్రకాష్‌రెడ్డి ఆదివారం మృతిచెందాడు. ఇటీవల మదనపల్లె నుంచి ద్విచక్రవాహనంలో బి.కొత్తకోటకు వస్తూ వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతన్ని కుటుంబీకులు తిరుపతికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో ఇతను మృత్యువాతపడ్డాడు. విషయం తెలియడంతో నగరపంచాయతీ కమిషనర్ మనోహర్ జయప్రకాష్ నివాసానికి వెళ్లి కుటుంబీకులను పరామర్శించి అంత్యక్రియలకు ఆర్థికసాయం అందించారు. మృతుడు గతంలో పంచాయతీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తూ గాయపడి వాటర్ మ్యాన్‌గా చేస్తున్నట్లు మున్సిపల్ సిబ్బంది తెలిపారు. ఇతని మృతిపట్ల నగరపంచాయతీ సిబ్బంది సంతాపాన్ని తెలిపారు.

వర్షం కోసం రామకోటి యజ్ఞం

వాల్మీకిపురం, ఆగస్టు 25: పట్టణంలోని నూతనంగా నిర్మించిన హరిమందిరంలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా గ్రామ పెద్దలు రామకోటి మహాయజ్ఞం నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం శ్రీరాముడికి పూజలు నిర్వహించి రామకోటి మహాయజ్ఞం ప్రారంభించారు. 24గంటల పాటు రామకోటి మహాయజ్ఞం ఏడు రోజుల పాటు నిరంతరాయంగా సాగనుంది. ఈకార్యక్రమంలో గాంధీపేట ప్రజలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించండి



సీఐని సన్మానిస్తున్న టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, తదితర నాయకులు

ములకలచెరువు, ఆగస్టు 25: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ రాజా రమేష్ సూచించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆదివారం ఇటీవల బాధ్యతలు చేపట్టిన సీఐ రాజా రమేష్‌ను టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా, టీడీపీ నాయకులు కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకిష్టా, మండల ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, మాజీ ఎంపీపీ సిగి నరసింహులు, నేతలు కేశవులు, ముత్తుకూరు మౌళా, జేసీబీ సుధాకర్‌నాయుడు, విజయ్‌కుమార్, భజంత్రి రామాంజులు, నాగేంద్ర, ప్రతాప్, బుర్రా రమణ, చాంద్‌బాషా, రెడ్డెప్ప, రమణమూర్తి, ఆదెన్న తదితరులు పాల్గొన్నారు.

రామసముద్రంలో సమతా సైనిక దళ్ ఏర్పాటు



దళ్ కార్యవర్గ సభ్యులతో దళితులు

రామసముద్రం, ఆగస్టు 25: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో దళిత సమస్యల సాధన కోసం రామసముద్రం మండలంలో సమతా సైనిక దళ్‌ను ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలోని దిగువ దళితవాడలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన దళితుల సమావేశంలో దళ్ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమతా సైనిక దళ్ మండల శాఖ అధ్యక్షుడిగా జయరాజ్, ఉపాధ్యక్షుడిగా బాలాజి, ప్రధాన కార్యదర్శిగా రామాంజులు, కోశాధికారిగా మాజీ జడ్పీటీసీ శివశంకర్‌తో పాటు ఏడుమంది దళ్ సభ్యులను ఎన్నుకున్నారు. ఈసందర్భంగా జయరాజ్ మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆమోదయోగ్యమైనది కాదని, దీనిపై దళితులకు అవగాహన కల్పించడం కోసం మండలంలోని అన్ని గ్రామాలలో పర్యటించి దళితులను చైతన్యం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు మండల అధ్యక్షుడు కృష్ణప్ప, శివ, నాగరాజ, సోము పలువురు దళితులు పాల్గొన్నారు.

వడ్డెర సంఘం నూతన కమిటీ నియామకం

మదనపల్లె అర్బన్ ఆగస్టు 25: మదనపల్లె డివిజన్ వడ్డెర సంఘం నూతన కమిటీని ఆదివారం ఏర్పాటు చేశారు. ఇందులో గౌరవాధ్యక్షుడిగా పూజారి వెంకటరమణ, అధ్యక్షుడిగా భక్తుల చలపతి, ప్రధాన కార్యదర్శిగా దేరంగుల శ్రీనివాసులు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఇడుగొట్టి సుధాకర్, కార్యదర్శిగా ఆలకుంట ప్రబాకర్, ప్రచార కార్యదర్శిగా ఇడుగొట్టి రెడ్డెప్ప, ఉపాధ్యక్షుడిగా బత్తల నారాయణలను ఎంపిక చేశారు. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు పిచ్చయ్య మాట్లాడుతూ వడ్డెరలు విద్యాపరంగా అభివృద్ధి చెందడానికి కృషి చేస్తామన్నారు. వడ్డెరల్ల సమావేశ మందిరం ఏర్పాటుకు ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని, ఇళ్లులేని పేదలకు గృహాల మంజూరు చేయించాలని కోరారు. రాయి కొట్టడం, క్వారీలు వడ్డెర కులస్థులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏపీ వడియరాజ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ తన్నీరు శ్రీనివాసరావు, ప్రధాన కార్య దర్శి తన్నీరు శ్రీనివాసరావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కుంచపు శ్రీనివాసులు, సహాయక కార్యదర్శి పి. చంద్ర పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ

మదనపల్లె అర్బన్, అగస్టు 25: డెంగ్యూ, మలేరియా లాంటి విషజ్వరాలు ప్రబలకుండా గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు మెరుగు పరచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఏఐటీయూసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ జిల్లా ప్రజలు డెంగ్యూ, మలేరియా విష జ్వరాల బారినపడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి విష జ్వరాల బారిన పిల్లలు పడకుండా చర్యలు చేపట్టాని కోరారు. జిల్లాలో ఆరోగ్యశాఖ అధికారులు మున్సిపల్ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య పనులు మెరుగుపర్చి తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. విషజ్వరాల పేరుతో ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తే రోగులకు రకరకాల పరీక్షల పేరుతో వేలాది రూపాయలు ఖర్చు చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రెడ్డెప్ప, తిరుమల, ముబారక్, మురళి, రవి, తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాష్టమి వేడుకలకు సర్వం సిద్ధం

- ముస్తాబైన రాయలసీమలోనే ఎత్తైన భారీ కృష్ణుడి విగ్రహం



ములకలచెరువు, ఆగస్టు 25: ములకలచెరువు మండలం వేపూరికోట సమీపంలోని రెడ్డివారిపల్లె క్రాస్ వద్ద వెలసిన భారీ శ్రీకృష్ణుడి విగ్రహం కృష్ణాష్టమి వేడుకలకు సిద్ధమైంది. శ్రీ అవధూత ఆదినారాయణ స్వామి ఆశ్రమంలో భారీ శ్రీకృష్ణుడి విగ్రహం ఉంది. రాయలసీమలోనే ఎత్తైన భారీ విగ్రహమిది. ఈ విగ్రహం ఎత్తు 35 అడుగులకుపైగా ఉంటుంది. ఆశ్రమంలో సోమవారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా కృష్ణుడికి క్షీరాభిషే కం, ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలు చేపడుతామని ఆశ్రమ నిర్వాహకులు వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.

మదనపల్లెలో జన్మాష్టమి వేడుకలు

మదనపల్లె అర్బన్, ఆగస్టు 25: పట్టణంలోని అనపగుట్టలోని గోవర్ధన్ గిరిలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు శ్రీకృష్ణా ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఉదయం నుంచే విశేషపూజా కార్యక్రమాలు, అభిషేకాలు, అర్చనలు, అనంతరం పిల్లలతో సాంస్కృతిక కార్యక్రమాలు, స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాయంత్రం స్వామివారికి వసంతోత్సవం అనంతరం ఉట్లోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయకమిటీ పేర్కొంది. విశేషపూజా కార్యక్రమాలకు అధిక సంఖ్యలో భక్తులు, ప్రజలు రావాలని కోరుతూ భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రెడ్డెమ్మకు ప్రత్యేక పూజలు

గుర్రంకొండ, ఆగస్టు 25:గుర్రంకొండ మండలం చెర్లోపల్లె రెడ్డెమ్మకొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయంలో అమ్మవారు సంతానలక్ష్మీగా ప్రసిద్ధి చెందారు. ఇందులో భాగంగా ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలను చేశారు. అనంతరం అమ్మవారిని పరిమళభరిత పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలను చేశారు. అమ్మవారిని దర్శించుకోవడానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు. అమ్మవారి కృపతో సంతానం పొందిన మహిళలు మొక్కులు తీర్చుకోవడానికి ఆలయానికి రావడంతో పరిసరాలు భక్తులతో రద్దీగా మారాయి. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఇళ్ల స్థలాల పేరిట రూ. 2 కోట్లు మోసం

మదనపల్లె అర్బన్, ఆగస్టు 25: మండలంలోని కోళ్లబైలు పంచాయతీలో పేదలకు ఇళ్ల ఇప్పిస్తామని కదిరికి చెందిన మంజునాథ్, దివ్యలు రెండు కోట్ల రూపాయలు మోసం చేశారని తాలుకా స్టేషన్‌లో బాధితులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కదిరి మండలం, ఇనగలూరుకు చెందిన మంజునాథ్, అతని ప్రియరాలు దివ్య మదనపల్లె మండలం కోళ్లబైలుకు వచ్చి కోళ్లబైలు గ్రామం, బయ్యారెడ్డి కాలనీలోని చేనేతల నుంచి ఒక్కో ప్లాటుకు రూ.3 నుంచి 4 లక్షలు వసూళ్లు చేసి రూ. 2 కోట్లు పైగా మోసం చేశారన్నారు. మంజునాథ్ పరారీలో ఉండగా దివ్య తనకు సంబంధం లేదని బాధితులకు తేల్చి చెబుతోందని బాధితులు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

గర్భాశయ క్యాన్సర్‌పై మహిళలు అవగాహన పెంచుకోవాలి



ఉచిత వైద్య శిబిరంలో మహిళలను పరీక్షిస్తున్న వైద్యులు

పీలేరు, ఆగస్టు 25: గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన పెంచుకోవాలని కేవీపల్లెలోని శ్రీ శ్రీనివాస ఛారిటబుల్ ట్రస్టు ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ శశికుమార్ రెడ్డి మహిళలకు విజ్ఞప్తి చేశారు. 'సంజీవని' పేరిట అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో శ్రీ శ్రీనివాస ఛారిటబుల్ ట్రస్టు కేవీపల్లె మండలంలో ఉచిత వైద్య శిబిరాలు, అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం మారెళ్ల గ్రామంలో శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవగాహన లేకపోవడం వల్ల గర్భాశయ క్యాన్సర్ నిశ్శబ్ద హంతకుడిలా మారి గ్రామీణ ప్రాంత మహిళల ప్రాణాలను కబళిస్తోందన్నారు. అందు కోసం కేవీపల్లె, కలికిరి, కలకడ మండలాల్లో అవగాహన సదస్సులు, ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మారెళ్లలో జరిగిన శిబిరంలో 145 మంది మహిళలను పరీక్షించి 37 మందికి పాప్ స్మియర్ టెస్టులు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో గైనకాలజిస్టులు సృజన, విద్య, ప్రీతి, వైద్యులు జిలాని, ప్రోగ్రాం వలంటీర్లు శ్రీనివాస్ రెడ్డి, సునీల్, రామాంజనేయులు, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.

జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి స్వంత భూమిలో కమ్యూనిటీ భవనం



కమ్యూనిటీ భవనం కోసం భూమిపూజ చేస్తున్న జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి దంపతులు

పెద్దతిప్పసముద్రం ఆగస్టు 25 : ఆంధ్రప్రదేశ్ లోకాయుక్తా జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి తన స్వగ్రామమైన టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లె సమీపంలో తన స్వంత భూమిలో కమ్యూనిటీ భవనం ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. పాపాఘ్నీ నది ఒడ్డున వెలసిన ప్రసిద్ధి గాంచిన సంఘమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో రూ.10 లక్షల వ్యయంతో ఆదివారం భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. సంఘమేశ్వరస్వామి ఆలయ దర్మకర్త రామాంజనేయరెడ్డి, ములకలచెరువు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, టి.సదుం పంచాయతీ సర్పంచ్ శారద అధ్యక్షతన ముఖ్య అతిథులుగా లోకాయుక్తా జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి, స్వర్ణలతరెడ్డి దంపతులు హాజరై ఆలయ ప్రాంగణంలోని తమ స్వంత భూమిలో భవన నిర్మాణం చేపట్టేందుకు భూమిని ఆలయానికి కేటాయించామని తెలిపారు. సంఘమేశ్వరస్వామి తమ కుటుంబానికి ఆరాధ్య దైవమని ఆలయ అభివృద్ధిలో భాగంగా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం టి.సదుం గ్రామస్తులు ఏర్పాటు చేసిన సన్మాన సభలో లోకాయుక్తా జస్టిస్ లక్ష్మణ్‌రెడ్డి తంపతులను గ్రామ సర్పంచ్, గ్రామస్థులు ప్రత్యేకంగా శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం లోకాయుక్తా చేతుల మీదుగా టి.సదుం గ్రామానికి చెందిన గ్రూపు సభ్యులకు 4.5 లక్షల చెక్‌ను అందించారు. కార్యక్రమంలో మనోజ్‌జయంత్‌రెడ్డి, బి.కొత్తకోట వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, తంబళ్లపల్లె నియోజకవర్గం పోల్ మేనేజ్మెంట్ అధ్యక్షుడు కుడుం శ్రీనివాసులు, టీడీపీ మండల అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, ములకలచెరువు టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్దా, పెద్దమండ్యం అధ్యక్షుడు బిల్డర్ రమణ, నాయకులు బూర్లపల్లె సుధాకర్‌రెడ్డి, బస్సు బయ్యారెడ్డి, తాడిగోళ్లపల్లె సుధాకర్‌రెడ్డి ప్రజలు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో ఇసుక పాలసీని అమలు చేయండి

- కలెక్టర్‌కు టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి వినతి

ములకలచెరువు, ఆగస్టు 25: తంబళ్లపల్లె నియోజకవర్గంలో ఇసుక పాలసీని వెంటనే అమలు చేయాలని తంబళ్లపల్లె నియోజవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను కోరారు. జిల్లా కేంద్రమైన రాయచోటిలో ఆదివారం జయచంద్రారెడ్డి కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ద్వారా సమస్య విన్నవించారు. ఇసుక కొరతతో గృహ నిర్మాణ కార్యక్రమాలు పూర్తిగా ఆగిపోయాయని, భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వీలైనంత త్వరగా ఇసుక లభ్యత అయ్యేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి ఇసుక పాలసీ తొందరగా మలయ్యేలా చూస్తానని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జున నాయుడు, టీడీపీ నేత మంత్రి గిరిధర్‌రెడ్డి, కురబలకోట మండల అధ్యక్షుడు వైజీ సురేంద్ర యాదవ్, రమణప్ప తదితరులు పాల్గొన్నారు.

యార్డులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలన

ములకలచెరువు, ఆగస్టు 25: ములకలచెరువు వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌పార్మర్, చేతికందే ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ రెడ్డికుమార్‌లు పరిశీలించారు. 'స్పందించకుంటే మూల్యం చెల్లించుకోక తప్పదు' ములకలచెరువు మార్కెట్‌లో పొంచి ఉన్న ప్రమాదం అన్న శీర్షికన ఆంధ్రజ్యోతిలో ఆదివారం వార్తా కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై స్పందించిన తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి ట్రాన్స్‌కో ఏఈ రెడ్డికుమార్‌తో కలిసి ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ తీగలను పరిశీలించి ట్రాన్స్‌ఫార్మన్‌ను జన సంచారం లేని చోటుకు మార్చి విద్యుత్ తీగల ఎత్తు పెంచాలని సూచించారు. దీంతో ట్రాన్స్‌కో సిబ్బంది తక్షణం విద్యుత్ స్థంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ తీగల ఎత్తు పెంచారు. అలాగే ట్రాన్స్‌ఫార్మర్‌ను జనసంచారం లేని చోటుకు మార్చేందుకు చర్యలు చేపట్టారు.

మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న మాజీ సైనిక ఉద్యోగుల నూతన అధ్యక్షుడు శ్రీనివాసులు

మదనపల్లె అర్బన్ ఆగస్టు 25: మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తానని మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులునాయుడు అన్నారు. ఆదివారం స్థానిక ఓ ప్రైవేట్ కళ్యాణ మండపంలో మదనపల్లె మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమ సంఘం కార్యవర్గం ఏకగ్రీమంగా ఎన్నికైంది. ఇందులో అధ్యక్షుడుగా కంచర్ల శ్రీనివాసులు నాయుడు, ఉపాధ్యక్షుడుగా లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శిగా వెంకటస్వామి, సంయుక్త కార్యదర్శిగా సుబ్బరాయుడు, ట్రెజరర్‌గా ప్రతాప్‌రెడ్డి, సభ్యులుగా రామమూర్తి, సత్యనారాయణ, సురేష్, సహదేవరెడ్డి, నరేంద్ర, సురేష్‌బాబు, వెంకటరమనారెడ్డి, భీమారెడ్డి, భాగ్యలక్ష్మీ, చౌడప్ప, ఎంవి రమణ, భాస్కర్, మహమ్మద్‌అలీ, ప్రభావతి, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికను కర్నూల్ రిటైర్డ్ కర్నన్ బాషా, రామమూర్తి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం 65, 71 వార్‌లో మెడల్ సాధించిన ప్రతి ఒక్కరికీ రూ. 15 లక్షలు అందిస్తుందని వారందురూ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డిఫెన్స్ కాలనీ ఏర్పాటు, సమావేశ మందిరానికి కృషి చేస్తామన్నారు. ఇళ్లు లేని సైనికులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయించడానికి కృషి చేస్తామన్నారు. సైనిక ఉద్యోగులు సంక్షేమం కోసం విధివిధానాలు రూపొందించి వారికి అండగా ఉంటామమని పేర్కొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన



ఉచిత వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకుంటున్న వృద్ధులు

మదనపల్లె టౌన్, ఆగస్టు 25: మదనపల్లె పట్టణంలో జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో తిరుపతి శ్రీవేంకటేశ్వర అరవింద కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 235 మంది వైద్య చికిత్సలు చేయించుకున్నారన్నారు. ఇందులో గ్లుకోమా, కార్నియా, రెటీనా, ఆర్బిట్, డక్ట్ తదితర కంటి పరీక్షలతో పాటు విజన్ పరీక్షలు నిర్వహించారన్నారు. మొత్తం 45 మంది కంటి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారన్నారు. వారికి తిరుపతిలో కంటి శస్త్ర చికిత్సలు చేస్తారని, వారికి బోజన, వసతి ఉచితంగా అందజేస్తారన్నారు. కార్యక్రమంలో అరవింద ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఆకాష్, డాక్టర్ రచన, ప్రిన్సిపాల్ రమాదేవి, నిర్వాహకుడు వసంత్ పాల్గొన్నారు.

మానవసేవే మానవత సంస్థ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న మానవత సంస్థ జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి

వాల్మీకిపురం, ఆగస్టు 25: సమాజంలో మనం చేసే మానవసేవే మాధవ సేవ అని మానవత సంస్థ జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి పేర్కొన్నారు. ఆదివారం వాల్మీకిపురం పట్టణంలోని సత్యసాయి సేవా సమావేశ మందిరంలో మానవతా సంస్థ సభ్యుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలతో పాటు యువతలో సేవాభావం పెంపొందే విధంగా ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. సంస్థలోకి మరింత మంది విశ్రాంత ఉద్యోగులు, యువత రావాలని ఆయన కోరారు. ప్రస్తుతం సంస్థ ద్వారా వైకుంఠ రథం, ఫ్రీజర్‌బాక్స్‌లు, బహిరంగ ప్రదేశాల్లో ప్రయాణికులు, ప్రజలు సేద తీరేందుకు బల్లలు ఏర్పాటు చేయడం, మొక్కలు నాటడంతో పాటు పలు సేవా కార్యక్రమాల్లో ముందుకెళ్తున్నామన్నారు. రాబోవు రోజుల్లో ఈ సేవలను పల్లెలకు విస్తరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఆనందశెట్టి, రామకృష్ణారెడ్డి, శంకర, చంద్ర, పీవీ నారాయణ, మురళికేశవరెడ్డి రాజారెడ్డి, లక్ష్మన్న, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి

మదనపల్లె అర్బన్, ఆగస్టు 25: మదనపల్లె పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఆదివారం మదనపల్లె అభివృద్ధి వేదిక నాయకులు హరిశర్మ, కృష్ణమూర్తిలతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. పట్టణ ప్రజలకు రోజు రోజుకు ట్రాఫిక్ సమస్య దడపుటిస్తోందని వాపోయారు. జనాభా పెరిగినంతగా పట్టణంలో సౌకర్యాలు పెంచలేదన్నారు. రోడ్ల విస్తరణ జరగకపోవడంతో ట్రాఫిక్ స్తంభిస్తోందన్నారు. మదనపల్లె మున్సిపాలిటీ ఏర్పడక ముందున్న రోడ్లే ప్రస్తుతం ఉన్నాయని వారు గుర్తు చేశారు. పట్టణంలో నుంచి బయటకు వెళ్లాలంటే ట్రాఫిక్ శాపంగా మారుతోందన్నారు. సబ్ కలెక్టర్ చైర్మన్‌గా నియమితులైనా ట్రాఫిక్ అడ్వైజర్ కమిటీ సమావేశం నిర్వహించి ఏళ్లు గడుస్తోందని వారు పేర్కొన్నారు. ట్రాఫిక్ సిగ్నల్ లైట్స్ ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ పోలీసులను పెంచాలని డిమాండ్ చేశారు. ఉదయం సాయంత్రం ఉద్యోగులు, కార్యాలయాలకు వెళ్లేవారు, కళాశాల, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వ్యాపారులు ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడుతున్నారన్నారు.